# అసోం సిఎంగా హిమంత బిశ్వశర్మ




# బలగం TV
BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం, 13 మే-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## భగీరథకు సిట్ నోటీసులు

- నేడు విచారణకు రావాలని ఆదేశం

హైదరాబాద్,మే12 : కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం భగీరథ్‌కు నోటీసులు జారీ చేసింది. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు విచారణకు హాజరు కావాలని సిట్ అధికారులు ఆదేశించారు. సిట్ అధికారులు బుధవారం పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌ను విచారించనున్నారు. ఈ కేసుకు సంబంధించిన పలు అంశాలపై ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు సమాచారం. బాధితురాలి స్టేట్‌మెంట్ నమోదు చేసిన అనంతరం పోలీసులు ఈ కేసులోని సెక్షన్లను మార్చారు. గతంలో నమోదు చేసిన పోక్సో యాక్ట్ సెక్షన్లను సవరించారు.

# ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం సహించం



- సజావుగా వరి, మొక్కజొన్న కొనుగోళ్లు
- ధాన్యం వెంటనే లారీల్లో తరలించాల్సిందే
- అవసరమైతే పోలీస్ సాయంతో ధాన్యం సేకరణ
- లారీలు పంపకుంటే క్రిమినల్ కేసులు పెట్టండి
- కలెక్టర్లకు సిఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు

హైదరాబాద్,మే12 : ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహిం చేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ధాన్యం లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఉపేక్షించొద్దని.. అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులకు వెనకాడవద్దని ముఖ్యమంత్రి ఆదేశించారు. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడా రైతులకు ఇబ్బం దులు కలగొద్దని తెలిపారు. అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా చూడాలని సూచించారు. మంగళవారం.. జిల్లా కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోలు, వరి ధాన్యం సేకరణపై జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సీఎం ఆదేశించారు. మిగతా 3లో..


## బిఆర్ఎస్ ముఖ్యనేతలతో కెసిఆర్ భేటీ



### పార్టీ సంస్థాగత నిర్మాణంపై ప్రధానంగా దృష్టి

గజ్వేల్,మే12 : బీఆర్ఎస్ ముఖ్య నేతలతో పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ భేటీ దాదాపు ఆరు గంటలుగా కొనసాగింది. ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో కేసీఆర్ వివిధ అంశాలపై పార్టీ నేతలతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వ నమోదు ప్రక్రియ, పార్టీ ఇన్‌ఛార్జ్‌ల నియామకం సహా పార్టీ బలోపేతం వంటి ముఖ్యమైన విషయాలపై కేసీఆర్ అధ్యక్షతన చర్చ జరిగినట్లు సమాచారం. ఈ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా పార్టీ ప్రధాన కార్యదర్శులు, మండలి, శాసనసభా పక్షాల ఉపనాయకులు పాల్గొన్నారు. అలాగే అసెంబ్లీ డిప్యూటీ ఎ÷-లోర్ లీడర్లు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, శాసన మండలి ఫ్లోర్ లీడర్ సిరికొండ మధుసూదనాచారి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు ఎల్.రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు ఉన్న గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీల రద్దుపైనా సుదీర్ఘ చర్చ కొనసాగినట్లు తెలుస్తోంది. ఈ కమిటీల స్థానంలో కొత్త కమిటీలను ఎన్నుకోవాలని కేసీఆర్ ఆదేశించినట్లు సమాచారం. కమిటీల్లో పార్టీ కోసం కష్టపడి పని చేసే యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ, జీహెచ్ఎంసీ ఎన్నికలపైనా మిగతా 3లో..

## నీట్ పేపర్ లీక్ కేసు



- 13మందిని అరెస్ట్ చేసిన పోలీసులు మిగతా 3లో..

## అన్నా డిఎంకెలో లుకలుకలు

- పళనిస్వామి నాయకత్వంపై తిరుగుబాటు
- టివికెకు మద్దతు ప్రకటించిన షణ్ముగం వర్గం మిగతా 3లో..

## చెరువులు, సరస్సులు, వెట్‌ల్యాండ్స్ పరిరక్షణ



- ప్రత్యేక దృష్టి సారించిన తెలంగాణ ప్రభుత్వం
- అధికారులతో మంత్రి కొండా సురేఖ సమీక్ష

హైదరాబాద్,మే12 : తెలంగాణ రాష్ట్రంలో చెరువులు, సరస్సులు, వెట్‌ల్యాండ్స్ పరిరక్షణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల సమీక్షా సమావేశం మంగళ వారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర వెట్‌ల్యాండ్స్ అథారిటీ కార్యకలాపాలు, వెట్‌ల్యాండ్స్ కాలుష్య నియంత్రణపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలోని చెరువులు, సరస్సుల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు సమగ్ర వివరాలు సమర్పించారు. ఈ సమావేశానికి అటవీ, రెవెన్యూ, ఇరిగేషన్, ఫిషరీస్ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్రంలోని చెరువులు, సరస్సుల పునరుద్ధరణ, అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికపై సమీక్షించారు. వెట్‌ల్యాండ్స్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. చెరువుల ఆక్రమణలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి దిశానిర్దేశర చేశారు. అక్రమ నిర్మాణాలు, కాలుష్య నియంత్రణపై ప్రత్యేక దృష్టి మిగతా 3లో..

## వ్యక్తిగత హక్కులకు భంగం



- అనుమతి లేకుండా పేరు, ఫోటోల వాడకం
- ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన నటుడు నాగార్జున

న్యూఢిల్లీ,మే12 : తన వ్యక్తిగత హక్కులకు భంగం కలిగిస్తున్నారంటూ ఢిల్లీ హైకోర్టును సినీ నటుడు అక్కినేని నాగార్జున ఆశ్రయించారు. తన అనుమతి లేకుండా పేరు, ఫొటోలను వాడుకుంటున్నారని హైకోర్టులో ఆయన పిటిషన్ దాఖలు చేశారు. ఓ బట్టల వ్యాపారి దుస్తులపై తన చిత్రాలు, పేరు వాడుతున్నాడని కోర్టు దృష్టికి నాగార్జున తీసుకెళ్లారు. ఈ కేసుపై నేడు విచారణ చేపట్టిన న్యాయస్థానం సదరు వ్యాపారిపై సీరియస్ అయ్యింది. నాగార్జున టీ షర్టులు మీరెలా అమ్ముతారంటూ వ్యాపారిని హైకోర్టు ప్రశ్నించింది. ఫొటోలను వాణిజ్యపరంగా వాడుకునే అధికారం మీకు ఎవరిచ్చారంటూ కోర్టు నిలదీసింది. తొలుత వ్యాపారి తరఫు న్యాయవాది శృతి అయ్యర్ వాదనలు వినిపిస్తూ 'ది ఘోస్ట్' సినిమాకు తాము అధికారిక మర్చండైజింగ్ భాగస్వాములమని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కాబట్టి తమకు కేసు నుంచి మినహాయింపు మిగతా 3లో..

## ఎపికి 10 , తెలంగాణకు 16 టిఎంసిల కేటాయింపు

హైదరాబాద్, మే 12: ఏపీ, తెలంగాణ తాగునీటి అవసరాల మేరకు కృష్ణా జలాలను వినియోగించుకోవాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సమావేశంలో నిర్ణయించారు. హైదరాబాద్‌లో జరిగిన కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ సమావేశంలో ఇరు రాష్ట్రాల ఈఎన్‌సీలు, ఉన్నతాధి కారులు పాల్గొన్నారు. సాగర్‌లో ఆగస్టు 15 వరకు ఏపీకి 10 టీఎంసీల వినియోగానికి కేఆర్ఎంబీ అనుమతించింది. తెలంగాణకు సాగర్ నుంచి 16, శ్రీశైలం నుంచి 6 టీఎంసీల వినియోగానికి అంగీకారం తెలిపింది. ఏపీ ఇప్పటికే ఎక్కువ నీరు వాడుకుందని సమావేశంలో తెలంగాణ అధికారులు కేఆర్ఎంబీ దృష్టికి తీసుకెళ్లారు.

# నీట్ ప్రవేశ పరీక్ష రద్దు





- పేపర్ లీక్ వ్యవహారంతో ఎన్‌టిఎ నిర్ణయం
- సిబిఐ విచారణకు ఆదేశించినట్లు వెల్లడి

న్యూఢిల్లీ,మే12 : జాతీయ అర్హత పరీక్ష నీట్ యూజీ-2026ను రద్దు చేసారు. పేపర్ లీక్ ఆరోప ణలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. నీట్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం రాజస్థాన్‌లో లీకైనట్లు వచ్చిన వార్తలు పెనుదుమారం రేపాయి. ఈ నేపథ్యంలో జాతీయ పరీక్ష సంస్థ (ఎన్‌టీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా మే 3న జరిగిన నీట్ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. త్వరలోనే కొత్త పరీక్ష తేదీలను వెల్లడిస్తామని తెలిపిం ది. విద్యార్థుల ప్రయోజనాలు, జాతీయ పరీక్షా వ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. కొత్త పరీక్ష కోసం విద్యార్థులు మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన మిగతా 3లో..

## జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండోవిడుత పంపిణీ



- రెండోవిడతపై 21న కేబినేట్‌లో ఖరారు చేస్తాం
- స్పెషల్ డ్రైవ్ ద్వారా డబుల్ ఇళ్లు పంపిణీ
- అధికారులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి

హైదరాబాద్,మే12 : రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత పంపిణీ ప్రారంభించనున్నట్లు తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగు లేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్ర మాన్ని ఆదిలాబాద్‌లో ప్రారంభిస్తామని చెప్పా రు. మంగళవారం గృహ నిర్మాణశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల విధి విధానాలను ఈనెల 21న జరిగే మంత్రివర్గ సమావేశంలో ఖరారు చేస్తామని పొంగులేటి చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం స్థలాలు గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు ఇచ్చేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. హైదరాబాద్‌లో స్థలాలు ఉన్నవారికి ఈ నెలాఖరులోపు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై కఠినంగా వ్యవహరిస్తామ న్నారు. రాష్ట్రంలో పేదల సొంత ఇంటి కలను సాకారం చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొలిక్కి వచ్చిన నేపథ్యంలో సీఎం రేవంత్ సూచన మేరకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2 వ తేదీన ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడతను లాంఛనంగా ప్రారంభి స్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై ఈ నెల 21 వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారులతో మంత్రి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాల్లో శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, రంగారెడ్డి జిల్లా ఇన్ ఛార్జి మంత్రి శ్రీధర్ బాబు, హైదరాబాద్ ఇన్ ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి మహ్మద్ అజారుద్దీన్, శాసన మండలిలో చీఫ్ విప్ మహేందర్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం దూరదృష్టి లేకుండా హైదరాబాద్ నగరానికి దూరంగా డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించడం వల్ల జరిగిన నష్టం కళ్లముందే కనిపిస్తున్నదన్నారు. మిగతా 3లో..

## నేషనల్ డెయిరీతో నార్మూల్ ఒప్పందం

### పాడిరైతులకు తొలుత పదికోట్లు చెల్లింపు

హైదరాబాద్,మే12 : నల్లగొండ-రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం లిమిటెడ్ (నార్మూల్), నేషనల్ డెయిరీ డెవలంప్‌మెంట్ బోర్డుతో త్రైపాక్షిక ఒప్పందం కుదర్చు కుంది. 15 ఏళ్లపాటు డెయిరీ అభివృద్ధి చేసే బాధ్యతను అది తీసుకోనుంది. ఒప్పందంలో భాగంగా మొదట పాడి రైతుల బకాయిలను చెల్లించేం దుకు రూ.10 కోట్ల రూపాయలను చెల్లించ నుంది. ఈ మేరకు ఎన్‌డిబిబి అధికారులతో తెలంగాణ రాష్ట్ర డెయిరీ విభాగం అధికారులు ఒప్పందాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, పశుసంవర్ధక, డెయిరీ, ఫిషరీస్ సెక్రటరీ ఇలంబర్తి, మదర్ డెయిరీ ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో కుల ప్రసక్తి ఉండదు



- చట్టం అందరికీ ఒకేలా ఉంటుంది
- పొన్న వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమన్న పిసిసి చీఫ్

హైదరాబాద్,మే12 : తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ వాఖ్యలను టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఖండించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసు వ్యవహారంలో మంత్రి పొన్నం చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి లేదా ప్రభుత్వానికి పొన్నం వ్యాఖ్యలతో ఎలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. మంగళవారం గాంధీభవన్‌లో మహేశ్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. కులసంఘం మధ్యవర్తిత్వం, వివాహం ద్వారా ఇలాంటి తీవ్రమైన కేసులను పరిష్కరించుకోవాలని పొన్నం అన్నారని తెలిపారు. మిగతా 3లో..

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

# తమిళనాడు అసెంబ్లీ స్పీకర్‌గా జెసిడి ప్రభాకర్

## డిప్యూటి స్పీకర్‌గా రవిశంకర్ ఎన్నిక



చెన్నై,మే12 : తమిళనాడు అసెంబ్లీ స్పీకర్‌గా టీవీకే ఎమ్మెల్యే జేసీడీ ప్రభాకర్ మంగళవారం నాడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీవీకేకు చెందిన మరో ఎమ్మెల్యే రవిశంకర్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక కోసం ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు ప్రోటెం స్పీకర్ ఎంవీ కరప్పయ్య తెలిపారు. తొలుత ప్రభాకర్ నామినేషన్‌ను ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ ప్రతిపాదించారు. ఒకే నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవంగా స్పీకర్ ఎన్నిక జరిగింది. అనంతరం ప్రోటెం స్పీకర్‌గా తన పాత్ర ముగిసినట్లు కరుప్పయ్య ప్రకటించారు. ఆ వెంటనే సభాసాంప్రదాయం ప్రకారం స్పీకర్ ప్రభాకర్‌ను ఆయన చైర్ వరకూ సభానేత కేఏ సెంగోట్టియన్, ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ తోడ్కొని వెళ్లారు. ఆయనకు అభినందనలు తెలిపారు. స్పీకర్‌గా ప్రభాకర్ బాధ్యతలు చేపట్టిన వెంటనే డిప్యూటీ స్పీకర్ ఎన్నికను చేపట్టారు. డిప్యూటీ స్పీకర్ పదవికి తురైయూర్ టీవీకే ఎమ్మెల్యే ఎం.రవిశంకర్ ఒక్కరే నామినేషన్ వేశారని, దీంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైందని ప్రభాకర్ ప్రకటించారు. రవిశంకర్ నామినేషన్‌ను సెంగోట్టియన్ ప్రతిపాదించారు.

# నీట్ పేపర్ లీకేజీకి కేంద్రానిదే బాధ్యత

## పేపర్ లీకేజ్‌పై సమగ్ర విచారణ చేపట్టాలి


## ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్



హైదరాబాద్,మే12 : దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష రద్దు కావడంపై ఎంపీ చామల కిరణ్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మే 3వ తేదీన జరిగిన నీట్ పరీక్షను రద్దు చేశారని అన్నారు. నీట్ పరీక్ష రద్దుకు నేషనల్ టెస్ట్ ఏజెన్సీ, సెంట్రల్ ఎడ్యుకేషన్ మినిస్ట్రీ, కేంద్రంలో అధి కారంలో ఉన్న బీజేపీ బాధ్యత వహించాలని డిమాం డ్ చేశారు. నీట్ పరీక్ష రద్దుతో విద్యార్థులు తమ అక డమిక్ ఇయర్‌ను కోల్పోయే అవకాశం ఉందన్నారు. నీట్ పరీక్ష రద్దుపై బీజేపీ ప్రభుత్వం చర్చ చేపట్టాల న్నారు. దేశంలో అనేక విషయాలపై చర్చ చేసే బీజే పీ విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశంపై సమాధానం చెప్పాలని ఎంపీ డిమాండ్ చేశారు. బీజేపీకి పాలనపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తు, సామాన్యుడి అవసరం బీజేపీకి వద్దా అని నిలదీశారు. నీట్ పరీక్ష రద్దుకు పూర్తిగా కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం డబ్బులు ఖర్చు పెట్టి కోచింగ్‌లు ఇప్పించి నీట్ పరీక్ష రాయిం చారని తెలిపారు. రాజస్థాన్‌లో నీట్ పేపర్ లీకేజీ ఘ టనపై కేంద్రం పూర్తి స్థాయిలో విచారణ జరిపించా లన్నారు. విద్యార్థుల అకడమిక్ ఇయర్ దెబ్బతిన కుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంపీ చామల కిరణ్ రెడ్డి డిమాండ్ చేశారు.

# తరుగు, తేమ పేరుతో దోపిడీ

## రైతు ఆందోళనకు ఎమ్మెల్యే మద్దతు



మెదక్,మే12 : ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తేమ, తరుగు పేరుతో రెండు కిలోలకు పైగా అద నంగా తీసుకుంటున్నారని, దీన్ని వెంటనే నిలిపి యాలని నర్సాపూర్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే సునితా లక్ష్మా రెడ్డి డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా కౌడిపల్లి మం డల కేంద్రంలో ధాన్యం కొనుగోలు చేయాలని జాతీ య రహదారిపై రైతులు, బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. రైతులకు మద్దతుగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రభుత్వం లారీల సమ స్య, హమాలీల సమస్యను వెంటనే పరిష్కరించి ధా న్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. అలాగే శివం పేట మండలం చిన్న గొట్టిముక్కల చౌరస్తా వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు ధర్నా చేశారు. రైతుల ధర్నాకు బీఆర్ఎస్ నాయకులు మద్దతు ప్రకటిం చారు. ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ రహదారిపై రైతులు ధర్నా చేయ డంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. పోలీ సులు రైతులను బుజ్జగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

# సంగారెడ్డి జిల్లాలో భారీ అగ్నిప్రమాదం



## గోడౌన్‌లో మంటలు చెలరేగి వాహనాలు దగ్ధం

సంగారెడ్డి,మే12 : సంగారెడ్డి జిల్లాలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. పటాన్‌చెరులోని శ్రీరామ్ ఆటో ఫైనాన్స్‌కు చెందిన వాహనాల గోడౌన్‌లో ఒక్క సారిగా మంటలు చెలరేగాయి. ఈ మంటల్లో మూడు టిప్పర్లు, డీసీఎం, రెండు ఆటోలు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోడౌన్‌లో నిల్వ ఉంచిన వాహనాల మధ్య నుంచి మంటలు వ్యాపించాయి. క్షణాల్లోనే మంటలు తీవ్రరూపం దాల్చడంతో గోడౌన్ మొత్తం దగ్ధమైంది.

అక్కడ పార్క్ చేసిన పలు కార్లు పూర్తిగా కాలిపో యినట్లు సమాచారం. అగ్నిప్రమా దానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేప ట్టారు. షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగి ఉం డొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘట నకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కామారెడ్డిలో రైల్‌రోకో కేసు..కవితకు రైల్వే కోర్టు సమన్లు

## నేడు సికింద్రాబాద్ కోర్టుకు హాజరు కావాలని ఆదేశం



హైదరాబాద్,మే12 : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల డిమాండ్ చేస్తూ నిర్వహించిన రైల్ రోకో కార్యక్రమం కేసులో తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధ్యక్షు రాలు కల్వకుంట్ల కవితకు సమన్లు జారీ అయ్యాయి. బుధవారం విచారణకు హాజరు కావాలని సికిం ద్రాబాద్ రైల్వే కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కొం తకాలం క్రితం కామారెడ్డి జిల్లా కేంద్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ కవిత ఆధ్వర్యంలో రైల్ రోకో కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా రైల్వే రవాణాకు అం తరాయం కలిగిందని రైల్వే ఏఎస్ఐ రవీంద్రబాబు ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. రైల్‌రోకోతో నిజామాబాద్-హైదరాబాద్ రూట్‌లో అంతరాయం ఏర్పడింది. నేటి ఉదయం 10:30కి విచారణకు హాజరు కావాలని సికింద్రాబాద్ రైల్వే కోర్టు ఆదే శించింది. దేవగిరి ఎక్స్‌ప్రెస్‌తో పాటు గూడ్స్ రైలు నిలిపివేతపై రైల్వే యాక్ట్ సెక్షన్ల కింద కవితపై న్యాయస్థానం కేసు నమోదు చేసింది. ఈ కేసులో కవితతో పాటు మరో 12 మంది బీఆర్ఎస్ నాయ కులపై కూడా కేసులు నమోదయ్యాయి. రైల్వేచట్టాల ఉల్లంఘన, ప్రజా రవాణాకు ఆటంకం కలిగించడం వంటి ఆరోపణలపై కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది.ఈ కేసు విచారణలో భాగంగా నేడు సికింద్రాబాద్ రైల్వే కోర్టుకు కవిత, బీఆర్ఎస్ నేతలు హాజరవుతారా లేదా అనేది ఉత్కంఠగా మారింది. బీసీ రిజర్వేషన్ల అంశం తెలంగాణ రాజకీయాల్లో కీలకంగా మారిన నేపథ్యంలో ఈ కేసు ప్రాధాన్యం సంతరించుకుంది.

# సనత్‌నగర్ టిమ్స్‌లో వైద్యసేవల ట్రయల్ రన్

- స్వయంగా పరిశీలించిన మంత్రి దామోదర
- జూన్‌లో ప్రారంభిస్తామని వెల్లడి



హైదరాబాద్,మే12 : సనత్‌నగర్ టిమ్స్‌లో జరుగుతున్న వైద్య సేవల ట్రయల్ రన్‌ను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పరిశీలించారు.హాస్పిటల్ బ్లాకులన్నీ మంత్రి కలియ తిరిగారు. ఓపీ రిజిస్ట్రేషన్, ఐపీ వార్డులు, ఎమర్జెన్సీ డిపార్ట్ మెంట్, సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ల్యాబులు, మెకనైజ్డ్ ల్యాండ్రీ, కిచెన్ తదితర అన్ని డిపార్ట్‌మెంట్లను మంత్రి పరిశీలించారు. పెండింగ్ పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి సూచించారు. హాస్పిటల్‌కు నీళ్లు, పవర్ సప్లైలో ఎలాంటి ఆటంకం ఉండకూడదని, 24 గంటల సరఫరా ఉండాలని మంత్రి సూచించారు. ఫైర్ సేఫ్టీ విషయంలో రాజీ ఉండకూడదని, అన్ని ఫ్లోర్లలో మరోసారి పూర్తిస్థాయి పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. రిసెప్షన్ ఏరియా, హెల్ప్ డెస్క్, ఓపీ కౌంటర్లు, వెయిటింగ్ హాల్, ఓపీ కన్సల్టేషన్ రూమ్స్, డయాగ్నస్టిక్స్, ఇన్ పేషెంట్ వా ర్డులు, ఫార్మసీ తదితర ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి.. రిజిస్ట్రేషన్ కౌంటర్స్, ఫార్మసీ కౌంటర్స్ పెంచాలని మంత్రి సూచించారు. సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ఎక్స్ రే, అల్ట్రాసౌండ్ తదితర యంత్రాలను పరిశీలించిన మంత్రి..అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ యంత్రాలు పూర్తిస్థాయిలో పేషెంట్లకు ఉపయోగపడాలని, ఇందుకు అవసరమైన డాక్టర్లు, ఇతర సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలని ఆరోగ్యశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రారంభం నాటికి అన్ని సౌకర్యాలతో హాస్పిటల్‌ను సిద్ధం చేయాలని, పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.జూన్‌లో సనత్‌నగర్ టిమ్స్‌ను ప్రారంభిస్తామని అన్నారు. ఇక్కడ సక్సెస్‌ఫుల్‌గా వైద్య సేవల ట్రయల్ రన్ జరుగుతోంది.కొన్ని ఫినిషింగ్ వర్క్స్ జరుగుతున్నాయి. ఆ పనులన్నీ గడువులోగా పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించామన్నారు. ఇది వెయ్యి బెడ్ల హాస్పిటల్, ఇందులో 300 ఎమర్జెన్సీ బెడ్లు ఉంటాయి. అత్యవసర పరిస్థితుల్లో బాధితుల ప్రాణాలు నిలిపే గొప్ప హాస్పిటల్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నాం. గుండె సంబంధిత వ్యాధుల చికిత్సలు, ఆర్గాన్ ట్రాన్స్‌ఎ÷-లాంటేషన్ సర్జరీలకు ఈ హాస్పిటల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ఉంటుందని వివరించారు.

# అన్నా డిఎంకెలో లుకలుకలు

## పళనిస్వామి నాయకత్వంపై తిరుగుబాటు

## టివికెకు మద్దతు ప్రకటించిన షణ్ముగం వర్గం



చెన్నై,మే12 : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం అన్నాడీఎంకే లో లుకలుకలు బయటపడ్డాయి. పళనిస్వామి నాయకత్వంపై తిరు గుబాటు మొదలయ్యింది. తాజాగా ఆ పార్టీలోని సీవీ షణ్ముగం వర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి విజయ్ సారథ్యంలోని తమిళగ వెట్రి కళగంకు మద్దతు ప్రకటించింది. ఆయన వర్గంలో 30 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. డీఎంకేతో చేతులు కలపాలని అన్నాడీఎంకే అనుకుందని, అందుకే పళనిస్వామి వర్గం నుంచి తాము విడిపోయామని మంగళవారంనాడు మీడియాతో మాట్లాడుతూ షణ్ముగం తెలిపారు. ఎన్డీయే కూటమి నుంచి బయ టకు వచ్చినట్టు చెప్పారు. వరుస ఓటములకు పళనిస్వామే కారణమని విమర్శించారు. పార్టీ పదవి నుంచి ఆయన దిగిపోవాలని డిమాండ్ చేశారు. అన్నాడీఎంకే గత దశాబ్ద కాలంగా పలు ఓటము లను చవిచూసిందని, మూడుసార్లు చిరకాల ప్రత్యర్థి డీఎంకే చేతిలో ఓడిపోతే, గత నెలలో టీవీకే చేతిలో మరో ఓటమి చవిచూసిందని షణ్ముగం తెలిపారు. పార్టీని పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అన్నాడీఎంకే భవిష్యత్తుపై కూలంకషంగా చర్చించాలని అన్నారు. ఎన్నికల్లో విజేతగా నిలిచిన టీవీకేకు మద్దతివ్వాలని మేము నిర్ణయించాం. డీఎం కేకు వ్యతిరేకంగానే అన్నాడీఎంకే పార్టీని స్థాపిం చడం జరిగింది. 53 ఏళ్లుగా డీఎంకేకు వ్యతిరేకం గానే పార్టీ రాజకీయాలు నడిచాయి. చరిత్ర ఇలా ఉంటే డీఎంకే మద్దతుతో అన్నాడీఎంకే ప్రభుత్వం ఏర్పాటు కావాలనే ప్రతిపాదన ముందుకు తెచ్చారు. అయితే మెజారిటీ సభ్యులు ఈ ప్రతిపాదనను తోసి పుచ్చారు. డీఎంకేతో పొత్తు పెట్టుకోవడం అంటే అన్నాడీఎంకే సొంత ఉనికి కోల్పోవడమే అవు తుంది. ప్రస్తుతం మా దృష్టి ఉంతా పొత్తులపై లేదు. సొంత పార్టీని పునరుద్ధరించి, పటిష్టం చేయడమే మా ఉద్దేశం. అంతిమంగా ఎన్నికల్లో విజయం సాధించిన టీవీకేకు మద్దతు ఇవ్వాలని నిర్ణయిం చాం' అని షణ్ముగం తెలిపారు. సొంత పార్టీని చీల్చే ఉద్దేశం లేదని షణ్ముగం వివరణ ఇచ్చారు. పార్టీ కీలక నాయకత్వంపై పోరాటంగా దీనిని పేర్కొ న్నారు. ముఖ్యంగా విజయ్, టీవీకేతో పొత్తుకు గత వారంలో నిరాకరించిన మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామికి వ్యతిరేకంగా తామంతా తీసుకున్న నిర్ణయమని చెప్పారు.

# బండి కుమారుడిని తప్పించే యత్నం

## సిట్ విచారణ పేరుతో కాలయాపన

## మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శలు



నిజామాబాద్,మే12 : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు, దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం ఆ యన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రమంత్రి కు మారుడు పరారీలో ఉన్నాడని అనడం హాస్యాస్పద మని అన్నారు. సిట్ విచారణ పేరిట నిందితుడిని సీఎం రేవంత్ రెడ్డి తప్పించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఒక మైనర్ బాలికకు డ్రగ్స్ ఇచ్చి, మద్యం తాగించి అత్యాచారం చేసినట్లు ఆరోపణలు వస్తున్నా.. పోలీసులు మూడు నెలలుగా ఫిర్యాదు తీసుకోకుండా తాత్సారం చేయడం వెనుక రాజ కీయ ఒత్తిడి ఉందని వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. మీడియాలో వార్తలు వచ్చిన వెంటనే గత్యంతరం లేక పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. పోక్సో కేసులో బాధితురాలికి రక్షణ కల్పించాల్సింది పోయి.. ఆమెపైనే హనీట్రాప్ కేసు పెట్టడం దారుణమని మండిపడ్డారు. మైనర్ బాలిక హనీట్రాప్ చేస్తుందా అని ప్రశ్నించారు. బాధితురా లిపైనే రివర్స్ కేసులు పెట్టడం చూస్తుంటే రేవంత్ రెడ్డి, బండి సంజయ్ ఒక్కటేనని అర్థమవుతుందని అన్నారు. బాధితురాలిపైనే రివర్స్ కేసులు పెట్టడం చూస్తుంటే రేవంత్ రెడ్డి, బండి సంజయ్ ఒకటేనని అర్థమవుతోందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి బండి సంజయ్‌ది ఫెవికాల్ బంధమని విమర్శించారు. వీళ్లిద్దరూ కలిసి వ్యాపారాలు చేస్తు న్నారని, కుంభకోణాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అందుకే కేంద్రమంత్రి కొడుకుపై ఇంత పెద్ద నేరం మోపబడినా ప్రభుత్వం మిన్నకుం డిపోయిందని అన్నారు. ఒక్క కాంగ్రెస్ నాయకుడు కూడా దీనిపై స్పందించకపోవడం వెనుక మర్మ మేంటని ప్రశ్నించారు. పొద్దున లేస్తే కేసీఆర్, కేట ీఆర్, హరీశ్‌రావు మీద విషం చిమ్మే బండి సంజ య్.. తన కొడుకు చేసిన నేరంపై ఏం సమాధానం చెబుతారని వేముల నిలదీశారు. తన కొడుకుపై వచ్చిన పోక్సో కేసుపై నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పోక్సో కేసులో నిందితుడైన బండి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని.. ఈ కేసులో రాజకీయ జోక్యం లేకుండా నిష్పక్షపాతంగా విచారణ జరపాలని.. బాధితురాలికి, ఆమె కుటుం బానికి తక్షణమే పూర్తిస్థాయి రక్షణ కల్పించాలి అని డిమాండ్ చేశారు.రాష్ట్ర పోలీసులు ఇప్పటికైనా ఒత్తిళ్లకు లొంగకుండా చట్టాన్ని గౌరవించాలని, బాధిత మైనర్ బాలికకు న్యాయం జరిగే వరకు తాము పోరాడుతామని స్పష్టం చేశారు.

# టీవీకే ఎమ్మెల్యేకు మద్రాస్ హైకోర్టు షాక్



చెన్నై,మే12 : తమిళనాడు నూతన ముఖ్యమంత్రి విజయ్ శాసనసభలో తన బలాన్ని నిరూపించు కునే ందుకు సిద్ధమవుతున్న వేళ ఒక టీవీకే ఎమ్మెల్యేకు మద్రాస్ హైకోర్టు షాకిచ్చింది. ఈ ఎన్నికల్లో ఒక్క ఓటు తేడాతో నెగ్గిన ఆ ఎమ్మెల్యే.. సభలో సీఎం విజయ్ బలపరీక్షలో పాల్గొనవద్దని ఆదేశించింది. ఈ మేరకు న్యాయస్థానం మంగళవారం మధ్యంతర ఉత్త ర్వులు జారీచేసింది. దాంతో విజయ్ బల పరీక్షలో టీవీకే కూటమి బలం 119 సీట్లకు పడిపో యినట్ల య్యింది. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్ని కల్లో శివగంగై జిల్లా తిరుప్పత్తూర్ నియోజకవర్గం నుంచి టీవీకే నేత శ్రీనివాస సేతుపతి విజయం సాధి ంచా రు. ఇక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పెరియ కరుప్పన్‌పై కేవలం ఒకే ఒక్క ఓటు తేడాతో సేతు పతి గెలుపొందారు. డీఎంకే నేత పెరియకరుప్ప న్‌కు 83,374 ఓట్లు పోలవగా.. శ్రీనివాస సేతు పతి 83,375 ఓట్లతో విజయాన్ని సొంతం చేసుకున్నారు. అయితే ఈ ఫలితాలపై డీఎంకే నేత పెరియ కరు ప్పన్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో పొరపాటు జరిగిందని తన పిటిషన్‌లో ఆరోపించా రు. ఈవీఎం ఓట్ల లెక్కింపు ప్రక్రియలోనూ అవకత వకలు చోటుచేసుకున్నాయని, కాబట్టి తిరుప్పత్తూర్ లో రీకౌంటింగ్ జరపాలని ఆ యన న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. అప్పటివరకు శ్రీనివాస సేతుపతి ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరిం చకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పెరియ కరుప్పన్ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయ స్థానం.. విజయ్ విశ్వా సపరీక్ష ఓటింగ్‌లో శ్రీనివాస సేతుపతి పాల్గొనవద్దని ఆర్డర్ వేసింది. మద్రాసు హైకోర్టు ఆదేశాలతో బలపరీక్షలో విజయ్‌కు ఒక ఓటు తగ్గినట్ల య్యింది. 234 శాసనసభ స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీలో విజయ్‌కి కాంగ్రెస్, వామ పక్షాలు, వీసీకే, ఐయూఎ ంఎల్ కలుపుకుని ప్రస్తుతం 120 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. అందులో ఇప్పుడు ఒక ఎమ్మెల్యే బలపరీక్షలో పాల్గొనే అవకాశం లేకపోవడంతో విజయ్ బలం 119కి తగ్గిపోయింది. అయితే విజయ్ బలపరీక్షలో నెగ్గేందుకు మాత్రం ఎలాంటి అవాంతరం లేదు. విజయ్ బలపరీక్షలో నెగ్గడానికి 118 మంది ఎమ్మెల్యేల మద్దతు సరిపోతుంది.

## నగరంలో మూడు చోట్ల చైన్ స్నాచింగ్‌లు

### ఆందోళనలో స్థానిక ప్రజలు

వరంగల్,మే12 : జిల్లాలో చైన్ స్నాచర్లు, పోకిరీల రెచ్చిపోతు న్నారు. సోమవారం రాత్రి మూడు చోట్ల చైన్ స్నాచింగ్ సంఘట నలు చోటు చేసుకున్నాయి. ఒక వ్యక్తితో సహా ఇద్దరు మహిళల మె డలో బంగారు గొలుసులను దొంగలు తెంచుకెళ్లారు. ఈ సంఘట నలు స్థానికులను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయి. వరంగల్ మిల్స్ కాలనీలో పోకిరీలు హంగామా సృష్టించారు. రాత్రి సమయంలో కొందరు యువకులు బైక్‌లపై తిరుగుతూ ప్రజలను భయపెడుతున్నట్లు తెలుస్తోంది. కాలనీలోని ఓ టీ స్టాల్ యజమానిపై పోకిరీలు దాడి చేశారు. దాడిలో టీ స్టాల్ యజమాని తీవ్రంగా గాయపడ్డాడని, అతన్ని స్థానికులు ఆసుపత్రికి తరలించి నట్లు సమాచారం. నగరంలో పోలీసు పెట్రోలింగ్ పూర్తిగా కనిపించడం లేదని ప్రజలు తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నారు. రాత్రి సమయంలో మహిళలు, వృద్ధులు ఒంటరిగా బయటకు రావడానికి భయపడుతున్న పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురంలో దొంగలు బీభత్సం సృష్టించారు. రాత్రి ఓ ఇంటి తాళాలు పగలగొట్టిన దుండగులు భారీగా బంగారు నగలు, వెండిని అపహరించారు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## బీదర్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

### బైకును ఢీకొని బోల్తాపడ్డ కర్నాటక ఆర్టీసీ బస్సు

### ప్రమాదంలో ముగ్గురు మృతి...ఇద్దరు సంగారెడ్డి వాసులు

సంగారెడ్డి,మే12 : కర్ణాటకలోని బీదర్ సమీపంలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రహదారిపై వెళ్తున్న బైక్‌ను కర్ణాటక రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్సు ఢీ కొట్టింది. అనంతరం ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురు ప్రయాణికులు అక్కడికక్కడే మరణించారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. అదే రహదారిపై వెళ్తున్న వాహనదారులు వెంటనే స్పందించి.. పోలీసులకు సమాచారం అందించారు. పోలీ సులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను బీదర్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ ప్రమాదంపై పోలీసు లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుల్లో ఇద్దరు సంగారెడ్డి జిల్లా వాసులు ఉన్నారని పోలీసులు వివరించారు. బీదర్ నుంచి ఆర్టీసీ బస్సు హైదరాబాద్ వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు చెప్పారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం బీదర్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంపై మృతుల కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు.

## హైకోర్టును ఆశ్రయించిన బండి భగీరథ్

### 14న విచారించనున్న వెకేషన్ బెంచ్

హైదరాబాద్,మే12 : కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమా రుడు బండి భగీరథ్ హైకోర్టును ఆశ్రయించారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో మధ్యంతర బెయిల్ కోరుతూ బండి భగీరథ్ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టుకు వేసవి సెలవులు కావడంతో వెకేషన్ బెంచ్‌లో పిటిషన్ వేశారు. పిటిషన్‌పై ఈనెల 14న హైకోర్టు వెకేషన్ బెంచ్ విచారణ జరిపే అవకాశం ఉంది.అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు బండి భగీరథ్ కేసుపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేస్తూ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసు సున్నితమైనది కావడంతో మహిళా ఐపీఎస్ అధికారిణి పర్య వేక్షణలో దర్యాప్తు కొనసాగించాలని డీజీపీ నిర్ణయించారు. ఇప్పటికే బాధితురాలి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేయడం జరిగింది. సిట్ ఏర్పా టు నేపథ్యంలో మరోసారి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసే అవకాశం ఉంది. మరోవైపు బండి భగీరథ్ కోసం పోలీసుల గాలింపు కొనసా గుతోంది. ఈ కేసుకు సంబంధించి అన్ని ఆధారాలను సేకరిస్తున్నామని, నేరం రుజువైతే నిందితుడిని కచ్చితంగా అరెస్ట్ చేస్తామని కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ స్పష్టం చేశారు.

## నీట్ పేపర్ లీక్ కేసు

### 13మందిని అరెస్ట్ చేసిన పోలీసులు



జైపూర్,మే12 : రాజస్థాన్‌లోని సికార్‌లో నీట్ పేపర్ లీక్ కేసు వ్యవహారంలో 13 మందిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వీరిని పోలీసులు విచారిస్తున్నారు. 'గెస్ పేపర్' పేరుతో మార్కెట్‌లోకి ఈనీట్ ప్రశ్నాపత్రం వచ్చింది. ప్రభుత్వం నిర్వ హిం చిన ప్రశ్నాపత్రంతోఈ 'గెస్‌పేపర్' 100శాతం సరిపోలినట్లు అధి కారులు గుర్తించారు.మేన ఈనీట్ పరీక్షనిర్వహించగా.. అంతకు ముందేఈ పరీక్షపేపర్ లీక్‌అయినట్లుఅధికారులు ధృవీకరించారు. ఈప్రశ్నాపత్రం రూ.20వేల నుంచి రూ.2లక్షలవరకు విక్రయించి నట్లు గుర్తించారు. కేరళలోని ఒక ఎంబీబీఎస్ విద్యార్థి వద్ద ఈ పేపర్‌లీక్ అయినట్లు పోలీసులు కనుగొన్నారు. మే 1వ తేదీన సికార్‌లోని స్నేహితుడితో ఎంబీబీఎస్ విద్యార్థి ఈ ప్రశ్నా పత్రం పంచుకున్నట్లు తెలుస్తుంది. ఆ తర్వాత కోచింగ్ సెంటర్లు, అభ్యర్థు లకు ఈ పేపర్ లీక్ అయినట్లు సమాచారం.నైల్ పరీక్షల్లో అసలు ప్రశ్నాపత్రంలోని 140 ప్రశ్నలు సరి పోలాయి. ఈ 140 ప్రశ్నలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరలయ్యాయి. ఈ విష యాన్ని గుర్తించిన ప్రభుత్వం ఈ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ పరీక్ష నిర్వహించే తేదీలు త్వరలో ప్రకటిస్తామని వెల్లడించింది.

# బిఆర్ఎస్ ముఖ్యనేతలతో కెసిఆర్ భేటీ

నేతలతో కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల తెలంగాణ పర్యటనపైనా కేసీఆర్ ఆరా తీస్తున్నట్లు సమాచారం. బండి సంజయ్ కుమారుడి కేసు వ్యవహారం కూడా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ అంశం గురించి కేసీఆర్‌కు బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ వివరించినట్లు సమాచారం. కొత్తగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపైనా బీఆర్ఎస్ నేతలతో కేసీఆర్ చర్చిచారు. అలాగే ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై బలంగా పోరాటాలు చేయాలని నేతలను కేసీఆర్ ఆదేశించినట్లు తెలుస్తోంది. ప్రధానంగా పార్టీ బలోపేతం, కొత్త కమిటీల నియామకంపై దృష్టి సారించారు.

# ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం సహించం

అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని.. గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటి కప్పుడు గోడౌన్స్‌కు తరలించాలని అన్నారు. ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాల్సిందే అని.. ప్రతి అధికారి జవాబుదారీ తనంతో వ్యవహరించాల్సిందే అని తేల్చిచెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై చర్యలకు ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు. గోడౌన్స్ సమస్య ఉన్న ప్రాంతాల్లో అవసరాన్నిబట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతుబజార్లు, ఫంక్షన్ హాల్స్‌ను ఎంగేజ్ చేసి ధాన్యాన్ని తరలించాలన్నారు. వెసులుబాటు ఆధారంగా అక్కడినుంచి గోడౌన్స్‌కు తరలించేలా ప్రణాళికలుండాలని తెలిపారు. కొనుగోళ్లపై ఎప్పటికప్పుడు సీఎస్‌కు పోర్ట్ పంపించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ధాన్యం లోడింగ్‌లో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమామీలను గుర్తించి వారితో పని చేయించుకోవాలని రేవంత్ తెలిపారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో లారీల కొరత ఉంటే ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలని సూచించారు. అకాల వర్షాల సమయంలో ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. అకాల వర్షాల సమయంలో నష్టం జరగకుండా శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ప్రతి ఐకేపీ సెంటర్‌కు ఒక అధికారిని నియమించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి రైస్ మిల్లు దగ్గర ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షించాలన్నారు. మిషన్ మోడ్‌లో పనిచేస్తేనే సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయని తెలిపారు. కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు తలెత్తవని.. ఏ సమస్య వచ్చినా కలెక్టర్లదే బాధ్యత అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# చెరువులు, సరస్సులు, వెట్‌ల్యాండ్స్ పరిరక్షణ

పెట్టాలని ఆదేశించారు. జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు ప్రత్యేక చర్యలు అవసరమని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. పక్షులు, జలచరాలు, పర్యావరణ సమతుల్యతకు వెట్‌ల్యాండ్స్ కీలకమని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో వెట్‌ల్యాండ్స్ పాత్ర అత్యంత ముఖ్యమని, వాటి సంరక్షణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వెట్‌ల్యాండ్స్ మ్యాపింగ్, మానిటరింగ్ ప్రక్రియపై కూడా సమావేశంలో చర్చించారు. చెరువుల స్థితిగతులు, ఆక్రమణలు, కాలుష్య పరిస్థితులపై నిరంతర పర్యవేక్షించాలని అధికారులు అభిప్రాయపడ్డారు. చెరువుల పునరుద్ధరణకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భూగర్భ జలాల సంరక్షణలో కూడా వెట్‌ల్యాండ్స్ కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెట్‌ల్యాండ్స్ సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, జీవ వైవిధ్య పరిరక్షణలో కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు.

# వ్యక్తిగత హక్కులకు భంగం

ఇవ్వాలని అభ్యర్థించారు. ఓ మార్కెటింగ్ ఏజెన్సీ ద్వారా ప్రొడక్షన్ హౌస్‌తో తమకు ఒప్పందం ఉందని.. నాగార్జున స్వయంగా ఆ వస్తువులను ప్రమోట్ చేశారని స్పష్టం చేశారు. దీనిపై నాగార్జున తరఫు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒప్పంద పత్రాలు అడిగినప్పటికీ సమర్పించ లేదని, కోర్టుకు ఇచ్చిన ఈ-మెయిల్ కాపీలు సైతం అసంపూర్ణంగా ఉన్నాయని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. చివరికి, ఈ వ్యవహారంలో తమకు నాగార్జునతో కానీ, సంబంధిత నిర్మాణ సంస్థతో కానీ ఎటువంటి ప్రత్యక్ష ఒప్పందం లేదని న్యాయస్థానం ముందు వ్యాపారి అంగీకరించారు. ఈ వాదనలపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. నాగార్జున, ప్రొడక్షన్ హౌస్‌తో ప్రత్యక్ష ఒప్పందం లేదని మీరే అంగీకరిస్తున్నప్పుడు.. టీ షర్టులను విక్రయించే చట్టబద్ధత ఎక్కడి నుంచి వచ్చిందని సీరియస్ అయ్యింది. అనంతరం తదుపరి విచారణను ఆగస్టు 3వ తేదీకి వాయిదా వేసింది.

# జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండోవిడుత పంపిణీ

అటువంటి తప్పు పునరావృత్తం కాకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు 5 నుంచి 8 కిలోమీటర్ల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లను నిర్మించే విధంగా నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకుని స్థలాలను గుర్తించి తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆనాటి ప్రభుత్వం నగరానికి 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో 2 బిహెచ్ కె ఇండ్లను నిర్మించి హైదరా బాద్ నగరంలో నివసిస్తున్న వారికి కేటాయించడం వల్ల తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశ్యంతో ఇండ్లు తీసుకున్న లబ్దిదారులు అక్కడ నివసించడానికి సంసిద్ధతం వ్యక్తం చేయడం లేదని క్షేత్ర స్థాయి పరిశీలనల్లో స్పష్టమైందన్నారు. ఈ అంశాన్ని ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని ఏ నియోజక వర్గానికి సంబంధించి ఆ నియోజకవర్గంలోనే ప్రభుత్వ స్థలాలు, మురికివాడలు, భూదాన్, గతంలో వివిధ పథకాల కింద నిర్మించిన ఇళ్లు శిధిలావస్థలో ఉన్న ప్రాంతాలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈ విషయంలో ప్రజా ప్రతినిధులను భాగస్వా మ్యులను చేయాలని అధికారులను ఆదేశించారు. 2 బిహెచ్ కె ఇండ్లకు లబ్దిదారులను కేటాయిం చడానికి యుద్ధప్రాతిపదికన స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశిం చారు. ఇప్పటికే పూర్తి అయిన వాటికి, వివిధ నిర్మాణ దశల్లో ఉన్న వాటికి ఈ నెలాఖరు కల్లా లబ్దిదా రులను గుర్తించాలని, అది కూడా ఆ కాలనీలకు అయిదు నుంచి ఎనిమిది కిలోమీటర్ల లోపు ఉన్న వారినే ఎంపిక చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే నిర్మాణాలన్నీ పూర్తైన ఇండ్లలో లబ్దిదారులు ఉండేలా చూసేలా నిరంతరం పర్యవేక్షించా లన్నారు. ఈ కాలనీల్లో మంచినీరు, డ్రైనేజి, విద్యుత్ వంటి కనీస సౌకర్యాల కల్పనకు వేగవంతమైన చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ పరిధిలో ఇండ్ల స్థలాలు ఉండి అర్హులైన లబ్దిదారులకు ఈనెల చివరిలోగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరక్టర్లు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని, పనితీరు మెరుగుపడాలని అన్నారు. పిడిలు తమ పరిధిలో గతంలో నిర్మించిన జెఎన్ యుఆర్ఎం, రాజీవ్ గృహకల్ప, వాంబే హౌసింగ్ కాలనీలన్నిటిని సందర్శించాలని స్పష్టంగా నిర్దేశిరచారు. అంగుళం ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనా కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి పొంగులేటి హెచ్చరించారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో యుఎల్ సి భూములు కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ, నిబంనలకు విరుద్దంగా కొంత భాగాన్ని రిజిస్ట్రేషన్ చేశారని , స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి సమావేశంలో మంత్రి దృష్టికి తీసుకుని రాగా వెంటనే సంబంధిత సబ్ రిజిస్ట్రార్?పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. శాశ్వత భవనాలు లేని ఆర్డీవో, తహశీల్దార్, సబ్ రిజస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. రెవెన్యూ, ఫారెస్టు సరిహద్దు వివాదాలకు ముగింపు పలికేలా రెండు శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# పోక్సో కేసులో కుల ప్రసక్తి ఉండదు

పొన్నం సూచనలను కాంగ్రెస్ ఖండిస్తోందని మహేశ్ గౌడ్ వ్యాఖ్యానించారు. మైనర్ల విషయంలో చట్టపరంగా ఇబ్బందులు తప్పవని చెప్పుకొచ్చారు. పోక్సో చట్టప్రకారం నిందితులకు కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. నేర పరిశోధనలో నిందితుడి కులం లేదా సామాజిక హోదాతో సంబంధం లేదని తెలిపారు. బండి సంజయ్ ఈ కేసులో కుల రాజకీయాలను తీసుకురావడం దురదృష్టకరమని అన్నారు. ఈ కేసులో ఎవరినీ వ్యక్తిగతంగా టార్గెట్ చేయాల్సిన అవసరం కాంగ్రెస్‌కి ఏమాత్రం లేదని స్పష్టం చేశారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని తేల్చిచెప్పారు. 'నారీ శక్తి' అని నినాదాలు చేసే బీజేపీ, ఇప్పుడు బాలికపై జరిగిన దాడి విషయంలో మౌనంగా ఉండటం దేనికి సంకేతం..? అని మహేశ్ గౌడ్ ప్రశ్నించారు. బాలిక కుటుంబ సభ్యులను భగీరథ్ బెదిరిస్తున్నట్లు వస్తున్న వార్తలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని అన్నారు. నిజమని తేలితే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కేసు విషయంలో ఎలాంటి రాజకీయ జోక్యం, కుల మతాల ప్రభావం లేకుండా పారదర్శకంగా విచారణ జరుగుతుందని స్పష్టం చేశారు. నిందితుడు ఎంతటి శక్తివంతుడైనా సరే, బాధితురాలికి తాము అండగా నిలుస్తామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# నీట్ ప్రవేశ పరీక్ష రద్దు

అవసరం లేదని, పరీక్ష ఫీజు చెల్లించనక్కర్లేదని తెలిపింది. పరీక్ష తేదీలను నిర్ణయించిన తర్వాత మళ్లీ అడ్మిట్ కార్డులు విడుదల చేస్తామని పేర్కొంది. ఇక, ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్‌టీఏ తెలిపింది. ఈనెల 3న జరిగిన నీట్ పరీక్షలో కెమిస్ట్రీ విభాగంలో వచ్చిన సుమారు 120కి పైగా ప్రశ్నలతో ఉన్న ఓ ప్రాక్టీసు పేపరును గుర్తించినట్లు రాజస్థాన్ అదనపు డీజీపీ విశాల్ బన్సాల్ వెల్లడించారు. ఈ మెటీరియల్ రాజస్థాన్‌లోని సికార్‌లో పరీక్షకు 42 గంటల ముందు వాట్సాప్‌లో అందుబాటులోకి వచ్చినట్లు గుర్తించారు. ఇందు లోని సమాచారం.. నీట్ ప్రశ్నపత్రంలోని 600 మార్కుల ప్రశ్నలతో పోలి ఉండటం గమనార్హం. కొన్ని ప్రశ్నల్లోని జవాబుల క్రమం కూడా అచ్చం ఒకేలా ఉండడం పలు అనుమానాలకు తావిచ్చింది. ఆ ప్రాక్టీసు పేపరు కేరళలోని ఓ వైద్య కళాశాలలో చదువుతున్న ఎంబీబీఎస్ విద్యార్థికి చెందినదిగా దర్యా ప్తులో వెల్లడైంది. ఆ వ్యక్తి ఈనెల 1న సికార్‌లోని తన స్నేహితుడికి ఈ మెటీరియల్ ఇచ్చాడని.. ఆ తర్వాత అది పీజీ వసతిగృహాలు, కోచింగ్ నెట్‌వర్క్‌లు, కెరీర్ కౌన్సిలర్లు, పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థు లకు చేరిందని అధికారులు తెలిపారు. ఆ మెటీరియల్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీకి సంబంధించిన 300కు పైగా చేతిరాత ప్రశ్నలు ఉన్నాయని వెల్లడించారు. దీనిని విద్యార్థులకు రూ.20వేల నుంచి రూ.2 లక్షల వరకు విక్రయించారని, కొందరు అభ్యర్థుల నుంచి ముందుగానే రూ.30 వేలకు పైగా వసూలుచేశారని గుర్తించామని రాజస్థాన్ పోలీసు అధికారులు పేర్కొన్నారు.

# ఆనాటి జైళ్లు దుర్భరంగా ఉండేవి

- బ్రిటిష్ హయాంలో నరక కూపాలుగా జైళ్లు
- తానూ ఎమర్జెన్సీలో జైలుకు వెళ్లి వచ్చా
- చంచల్‌గూడాలో మ్యూజియం, ఫీల్ ది జైల్ ప్రారంభంలో గవర్నర్



హైదరాబాద్,మే12 : స్వాతంత్ర్యానికి ముందు జైళ్లు ఎంత అమానవీయంగా ఉండేవో ప్రజలకు తెలియజేయాల్సి ఉందని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తెలిపారు. మంగళవారం చంచల్‌గూడ జైలులో ఏర్పాటు చేసిన మ్యూజియం, ఫీల్ ది జైల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ.. స్వాతంత్రానికి పూర్వం జైల్లో గడిపిన వారు ఎలా ఉండేవారనే విషయం ఈ మ్యూజియంను చూస్తే తెలుస్తుందన్నారు. తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో మ్యూజియం, ఫీల్ ది జైల్ ప్రారంభించడం తనకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ మ్యూజియంలో ఉన్నది కేవలం ఇతిహా సానికి సంబంధించిన వస్తువులు కాదన్నారు. స్వాతంత్రానికి ముందు జైళ్లలో ఉన్నవారు ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నారో ఈ మ్యూజియం ద్వారా తెలుస్తుందని చెప్పారు. శిక్షల పేరుతో సంస్కారాన్ని, శరీరాన్ని, మనస్తత్వాన్ని విరగ్గొట్టే ప్రయత్నం చేశారని బ్రిటిష్ పాలనలో సాగిన అకృత్యాలను ఆయన వివరించారు.మన కోసం మన పూర్వీకులు పడ్డ కష్టాన్ని తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరు ప్రయత్నం చేయాలని ప్రజలకు తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. విద్యార్థి నాయకుడిగా ఉన్న సమయంలో తాను పలుమార్లు జైలుకు వెళ్లానన్నారు. ఎమర్జె÷న్సీ సమయంలో 21 రోజులు తాను జైల్లో ఉన్నానని ఆయన గుర్తు చేసుకున్నారు. అప్పుడే జైలు ఎలా ఉంటుందో తనకు తెలిసిందని వివరించారు. గతంలో ఉత్తరప్రదేశ్‌లో కళ్యాణ్ సింగ్ ప్రభుత్వంలో జైళ్ల శాఖ మంత్రిగా తాను పని చేశానని తెలంగాణ గవర్నర్ గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా జైళ్లలో తాను పలు సంస్కరణలు తీసుకొచ్చానని తెలిపారు. ఈ సంస్కరణలతో ఖైదీలు సంతోషం వ్యక్తం చేశారని చెప్పారు. ఈ రోజు మ్యూజియంలో చూసిన దృశ్యాలతో.. మళ్లీ ఆనాటి జ్ఞాపకాలు తనకు గుర్తుకు వచ్చాయన్నారు. ఖైదీలలో ప్రతి ఒక్కరూ క్రిమినల్స్ కాదని.. పరిస్థితులు వారిని ఆ సమయంలో నిందితులుగా మార్చాయని వివరించారు. ఖైదీలలో మార్పు తీసుకురావడానికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జైలు అధికారులకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. మరోసారి తప్పుచేసే ఆలోచన రాకుండా ఖైదీల్లో పరివర్తన తీసుకురావాలని అధికారులకు స్పష్టం చేశారు. సాధారణ ప్రజల కోసం చంచల్‌గూడ జైలు అధికారులు వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. జైలు ఆవరణలో 'జైల్ మ్యూజియం', 'ఫీల్ ది జైల్' పేరుతో ప్రత్యేక బ్లాక్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ప్రారంభించారు. ఇప్పటికే గోవా, కోల్‌కతా వంటి ప్రాంతాల్లో జైలు మ్యూజియాలు ఉన్నాయి. తాజాగా





హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలు కూడా ఈ జాబితాలో చేరింది. జైల్ మ్యూజియంలో జైలు చరిత్ర, ఉపయోగించిన పాత వస్తువులు, ఖైదీల జీవితం, శిక్షల విధానాలు వంటి అంశాలను ప్రదర్శిం చనున్నారు. ఇది విద్యార్థులు, పర్యా టకులు, సాధారణ ప్రజలకు జైలు వ్యవస్థ గురించి అవగా హన కల్పించడానికి ఉపయోగపడనుంది. 'ఫీల్ ది జైల్' బ్యారక్ ద్వారా సాధారణ ప్రజలు ఒకరోజు జైలు జీవితాన్ని అనుభవించేలా జైలు అధికారులు అవకాశం కల్పించారు. ఫీజు చెల్లించి రిజర్వేషన్ చేసుకున్న వారు జైలు రూల్స్ ప్రకా రం ఒక రోజు బ్యారక్‌లో ఉండి, జైలు ఆహారం, రొటీన్ కార్యకలాపాలు, శిక్షల వాతావరణాన్ని అనుభవించ వచ్చు. ఇది జైలు జీవితం ఎంత కష్టమో అర్థం చేసుకోవ డానికి సహాయపడుతుందని అధికారులు తెలిపారు.

# జగన్‌వి నీతి మాలిన రాజకీయాలు

అభివృద్ధి అంటే గిట్టని వైసిపి నేత

అమరావతిని చూసి ఓర్వలేక మావిగన్ జపం

జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం,మే12 : మూడు రాజధానుల వ్యవహారం ముగిసినా..ఇప్పుడు మావిగన్ పేరుతో జగన్ విన్యాసాలు చేస్తున్నారని, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుంటే చూసి ఓర్వలేక జగన్ రెడ్డి విషం చిమ్ముతున్నారని ధ్వజమెత్తారు. మంగళవారం మచిలీపట్నంలో మంత్రి కొల్లు రవీంద్ర పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ రెడ్డి లాంటి దుర్మార్గుడి చూపు రాష్ట్రంపై పడకూడదని నాడు ఆయన తండ్రే తరిమేశారని ఆరోపించారు. ప్రజావేదిక కూల్చివేతతో జగన్ రెడ్డి రాష్ట్రంపై తన దుర్మార్గాలకు శ్రీకారం చుట్టారని దుయ్యబట్టారు. మూడు రాజధానుల పేరుతో అధికారంలో ఉన్న ఐదేళ్లు అరాచకం సృష్టించారని మంత్రి కొల్లు రవీంద్ర ఆగ్రహించారు. భూములిచ్చిన రైతన్నలను పోలీసుల లాఠీలతో కొట్టించి, బూటు కాళ్లతో తన్నించారని విమర్శించారు. పేదల బియ్యాన్ని పందికొక్కులా బొక్కేసినోళ్లు కూడా నీతులు మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. జగన్ తన తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని క్విడ్ ప్రో కో ద్వారా ప్రజల ఆస్తులను దోచారని మండిపడ్డారు. ఐదేళ్లు అడ్డగోలుగా దోచుకుని అమరావతి నిర్మాణంపై నిందలేయడం సిగ్గుచేటని అన్నారు. మావిగన్ అంటూ ఇప్పుడు మాట్లాడే వైసీపీ నేతలు.. గత ఐదేళ్లు ఏం చేశారు..? అని ప్రశ్నించారు. జగన్ రెడ్డికి భజన చేయడం తప్ప వైసీపీ నేతలు సొంత బుర్రలు వాడటం మానేశారని సెటైర్లు గుప్పించారు.అమరావతే రాజధాని అని ఒకసారి.. మూడు రాజధానులని మరోసారి.. ఇప్పు డు మావిగన్ అంటూ నీతి లేని వ్యాఖ్యలు చేస్తున్నా రని కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. కృష్ణా గుంటూరు జిల్లాల్లోని వైసీపీ నేతలు జగన్ రెడ్డికి భజన చేయ డం తప్ప రాష్ట్రాభివృద్ధి పట్టదా..? అని నిలదీశారు. మూడు ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. రాయల సీమకు గతంలో కియా, ఇప్పుడు డ్రోన్స్, డిఫెన్స్, రాయల్ ఎన్ ఫీల్డ్ తీసుకువచ్చామని ప్రస్తావించారు. ఉత్తరాంధ్రలో భోగాపురం, గూగుల్ డేటా సెంటర్, అర్సెలార్ మిట్టల్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పుడు నీతులు మాట్లాడుతున్న బియ్యం దొంగ ఐదేళ్లలో బందరు పోర్టు ఎందుకు పూర్తి చేయలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పేర్ని నాని తన స్థాయి మరిచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురించి మాట్లాడుతున్నారని కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# 24 గంటల్లోనే వాహన రిజిస్ట్రేషన్

రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

అమరావతి,మే12 : ఏపీలో కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై 24 గంటల్లోనే కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ పూర్తి చేయనున్నట్లు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ కొత్త విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. వాహనదారులకు వేగవంతమైన సేవలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. డీలర్ టెంపరరీ రిజిస్ట్రేషన్ అనంతరం 24 గంటల్లోనే రిజిస్ట్రేషన్ కు ఆమోదం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఫ్యాన్సీ నం బర్ వాహనాలకు మా త్రమే మినహాయింపు ఉంటుందని మంత్రి తెలిపారు. గడువులోపు సంబంధిత అధికారులు స్పందించకపోతే ఆటోమేటిక్‌గా రిజిస్ట్రేషన్ ఆమోదం అయినట్లు పరిగణించనున్నట్లు తెలిపారు. సెలవు రోజుల్లో కూడా ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్‌ను ఆమోదిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తు తం పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లకు చెక్ పెట్టనున్నట్లు తెలిపారు. ప్రజలకు పారదర్శకంగా, సుల భంగా సేవలు అందించడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ కొత్త విధానం అమలు చేయనున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రకటించారు.

# తమిళనాట బ్యానర్లు ఫ్లెక్సీలు బ్యాన్

అభిమానులకు సిఎం విజయ్ ఆదేశం



చెన్నై,మే12: తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) శ్రేణులకు ఆ పార్టీ అధిష్టానం కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పార్టీని స్థాపించామని తెలిపిన టీవీకే, ప్రజ లు ఇబ్బంది పడే పనులకు దూరంగా ఉండాలని స్పష్టం చేసింది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి, మంత్రి ఎన్. ఆనంద్ ఒక అధికారిక ప్రకటనను విడు దల చేశారు. నాయకుల పుట్టినరోజులు లేదా కుటుంబ వేడుకల సందర్భాల్లో వీధులు, బహిరంగ ప్రదేశా లు, జనసమూహం ఉన్న చోట లేదా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగి ంచేలా ఎలాంటి బ్యానర్లు, పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూ డదని పార్టీ కార్యకర్తలను ఆదేశించింది. అంతేగాకుండా.. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఎలాంటి వేడుకలు జరపకూడదని, ఒకవేళ పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి విజ య్ నిర్ణయించినట్లు పార్టీ ప్రకటించింది. ప్రజలు మనపై ఎంతో నమ్మకం ఉంచారని, ఆ నమ్మకాన్ని కాపాడుకుంటూ బాధ్యతా యు తంగా నడుచుకోవాలని కార్యకర్తలకు సూచించింది. తమిళనాడు అభివృద్ధి కోసం పయనిస్తున్న తరుణంలో, ప్రజా ప్రయోజనాలకు భంగం కలిగించే చర్యలను ఏమాత్రం సహించబోమని ఈ ప్రకటన ద్వారా టీవీకే గట్టి హెచ్చరిక జారీ చేసింది.

# కొత్తగా 5 ఫైర్ స్టేషన్ల ఏర్పాటు

దశలవారిగా 1275 ఖాళీల భర్తీ

పారిశ్రామిక ప్రాంతాల్లో ఇడస్ట్రీల భాగస్వామ్యం

అధికారులతో సమీక్షలో హోంమంత్రి అనిత



అమరావతి,మే12 : కొత్తగా ప్రతిపాదించిన 5 ఫైర స్టేషన్ల ఏర్పాటును వేగవంతం చేయాలని ఆంధ్ర ప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత సూచించారు. విశాఖపట్నం పశ్చిమ పారిశ్రామిక ప్రాంతాల్లో ఇండస్ట్రీల భాగస్వామ్యంతో ఫైర్‌స్టే షన్లను ప్రతిపాదించినట్లు తెలిపారు. అగ్నిమాపక శాఖలో 1,275 ఖాళీలను దశల వారీగా భర్తీ చేయాలని ఆదేశించారు. అగ్నిమాపక శాఖ పనితీరుపై అనిత సచివాలయంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఫైర్‌స్టేషన్లు లేని 22 నియోజకవర్గాల పరిస్థితిపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడారు. జాబ్ క్యాలెండర్‌లో ఉన్న 305 పోస్టుల నియామక ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఫైర్ సిబ్బంది స్పందన సమయాన్ని 30 నిమిషాల నుంచి 15 నిమిషాలకు తగ్గించాలని మార్గనిర్దేశం చేశారు. పరిశ్రమల సహకారంతో ఫైర్ అవుట్‌పోస్టుల ఏర్పాటును పరిశీలించాలని హోంమంత్రి అనిత సూచించారు. ఫైర్ టెండర్ల వినియోగంపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. సెజ్ ప్రాంతాల్లో సమష్టి స్టేషన్ల ఏర్పాటుపై దృష్టిసారించాలని పేర్కొన్నారు. పరిశ్రమల్లో ఫైర్‌సేఫ్టీ అధికారుల నియామకం తప్పనిసరిగా చేయాలని స్పష్టం చేశారు. లైసెన్స్ పొడిగింపులకు ఫ్సేఫ్టీ సర్టిఫికెట్లు తప్పనిసరి చేయాలని సూచించారు. అడవిలో అగ్నిప్రమాదాల నియంత్రణలో డ్రోన్ల వినియోగంపై దృష్టిసారించాలని ఆదేశించారు. వ్యర్థాలపై సరైన వర్గీకరణ లేకపోవడంతో అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

# గుడులు, బడుల వద్ద మద్యం షాపుల తొలగింపు

సిఎంను అభినందిస్తూ విశాల్ పోస్ట్



చెన్నై,మే12 : తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తీసుకున్న సాహసోపేత నిర్ణయంపై సినీ నటుడు విశాల్ ప్రశంసల వర్షం కురిపించారు. ప్రార్థన మందిరాలు, విద్యాసంస్థలు, ముఖ్యంగా పాఠశాలల సమీపంలో ఉన్న 717 మద్యం దుకాణాలను మూసివేస్తున్నట్లు సీఎం విజయ్ ప్రకటించడంపై విశాల్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఈ నిర్ణయం ఎంతో మంది విద్యార్థినులకు, సామాన్య ప్రజలకు పెద్ద ఊరటనిస్తుందని ఆయన కొనియాడారు. అలాగే విశాల్ తన పోస్ట్‌లో ఒక ఘటనపై ప్రస్తావిస్తూ.. 'ఆర్.కె. నగర్‌లో నేను కలిసిన ఒక విద్యార్థిని, ప్రతిరోజూ స్కూల్ నుంచి ఇంటికి వెళ్లేటప్పుడు మద్యం షాపుల దగ్గర ఎదురయ్యే వేధింపుల గురించి, ఆ ఒత్తిడి గురించి ఫిర్యాదు చేసింది. ఆ అమ్మాయి లాంటి ఎంతో మంది విద్యార్థినులు, సామాన్యులు నేడు మీ నిర్ణయం పట్ల ఎంతో సంతోషంగా ఉన్నారు. వారి ముఖాల్లో మీరు చిరునవ్వు నింపారు' అని విశాల్ పేర్కొన్నారు. పాఠశాలల సమీపంలో మద్యం షాపులను తొలగించడం వల్ల సమాజంలో ఒక పెద్ద సమస్య తొలగిపోతుందని, సీఎం విజయ్ మరియు ఆయన ప్రభుత్వాన్ని తాను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని విశాల్ చెప్పుకోచ్చాడు.

# ఉదయనిధి మరోమారు అనుచిత వ్యాఖ్యలు

- ఉదయనిధి వ్యాఖ్యలపై మండిపడ్డ బిజెపి నేత

చెన్నై,మే12 : తమిళనాడు మాజీ ఉప ముఖ్యమంత్రి, డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ మరోసారి సనాతన ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. మూడేళ్ల క్రితం ఉదయనిధి సనాతన ధర్మంపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. సనాతన ధర్మాన్ని డెంగ్యూ, మలేరియాతో పోల్చుతూ దానిని నిర్మూలించాలని వ్యాఖ్యానించారు. ఆ వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. పలువురు కోర్టులలో పిటిషన్లు కూడా వేశారు. మంగళవారం మధ్యాహ్నం తమిళనాడు అసెంబ్లీలో కూడా ఉదయనిధి అదే తరహా వ్యాఖ్యలు చేశారు. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని అసెంబ్లీ వేదికగా ప్రసంగించారు. అసెంబ్లీ కొత్త స్పీకర్‌గా ఎన్నికైన జె.సి.డి. ప్రభాకర్‌ను అభినందిస్తూ చేసిన ప్రసంగంలో ఉదయనిధి స్టాలిన్ ఈ వ్యాఖ్య చేశారు. ఉదయనిధి వ్యాఖ్యలపై తమిళనాడు బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసన్ ఘాటుగా స్పందించారు. ఎన్నికల్లో ఓటమి ఎదురైనా ఆయన మారలేదని విమర్శించారు. డీఎంకే నిజంగా ఇదే సిద్ధాంతాన్ని నమ్మితే ఎన్నికల మేనిఫెస్టోలో ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు.హిందూ మతాన్ని నిర్మూలించడమే ఉదయనిధి స్టాలిన్, డీఎంకేల విధానమైతే, దానిని వారి ఎన్నికల మేనిఫెస్టోలో ఎందుకు ప్రస్తావిం చలేదని మండిపడ్డారు. ఎన్నికల ప్రచార సమయంలో ఉదయనిధి స్టాలిన్‌సనాతన ధర్మం నిర్మూలన గురించి ఎందుకు మాట్లాడలేదు. ఎన్నికల ప్రచారం చివరి రోజున 'మేం హిందువులకు వ్యతిరేకం కాదు' అనిస్టాలిన్‌ఎందుకు చెప్పుకున్నారు' అని శ్రీనివాసన్ ప్రశ్నించారు.

## సంపాదకీయం

# రాజకీయ పార్టీల్లో సర్ భయాలు !

సర్ ప్రక్రియ పేరు చెబితేనే రాజకీయ పార్టీల్లో గుబులు పుడుతోంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో త్వరలోనే సర్ ప్రక్రియ మొదుల కానుంది. దీంతో ఓటర్ల ఏరివేత చేపడతారు. చనిపోయిన వారి, బోగస్ ఓట్లతో పాటు, డబుల్ ఓట్లు, ఇతర రాష్ట్రాల్లోనూ ఉన్న ఓట్లను తొలగిస్తారు. ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ సాగింది. ఇప్పుడు ఎపి, తెలంగాణలో సాగనుంది. అయితే సర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్, బిఆర్ఎస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు తమ పార్టీ శ్రేణులను అప్రమత్తం చేశాయి. బూత్ లెవల్లో అప్రమత్తం గా ఉండాలని హెచ్చరించాయి. దీనినిబట్టి వీరి ఆందోళన ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. నిజంగానే అవసరమే. అర్హులైన వారి ఓట్లను తొలగిస్తే ఆక్షేపించాల్సిందే. అడ్డుకోవాల్సిందే. అలాగే నకిలీ ఓట్లను తొలగిండంలో కూడా రాజకీయ పార్టీలు సహకరించాలి. సర్ పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా సంస్కరించే కార్యక్రమం దేశం నలుమూలలా సంచలనంగా మారిన నేపథ్యంలో ఈ భయాందోళనలు వెన్నాడుతున్నాయి. ఈ కార్యక్రమం ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఆయా రాష్ట్రాల్లో చేపట్టడం జరిగింది. అయితే జాబితాను సంస్కరించడం ఇదే మొదటిసారి కాదు. 1951 నుంచి 2004 వరకు ఇలాంటి కార్యక్రమం 8 సార్లు జరిగింది. 2004 తర్వాత మళ్లీ ఇప్పుడు అంటే 21 ఏండ్ల తర్వాత ఈసీ ఈ కార్యక్రమం చేపట్టింది. అయితే ఇంతకు మునుపు లేని గందరగోళం, దుమారం ఇప్పుడే ఎందుకనేది ప్రశ్న.సర్ పేరుతో లక్షలాది మంది పేర్లను ఓటర్ల జాబితాలనుంచి తొలగిస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. అందుకే రాజకీయ పార్టీల్లో ఇది భయాందోళన కలిగిస్తుంది. రాజకీయా పార్టీ లు కావాలని ఓటర్లను చేర్పిస్తుంటారు. ఇందులో బోగస్ ఓట్లు కూడా ఉంటాయి. ఓటు అనేది రాజ్యాంగం ప్రతి పౌరుడికీ కల్పించిన హక్కు. అది ప్రతి ఒక్కరికి అవసరం. ప్రజాస్వామ్యంలో ఓటర్ గా నమోదు చేసుకోవడం బాధ్యత. ఓటు వేయడం కూడా అంతే బాధ్యతగానే భావించాలి. కానీ రాజకీయ పార్టీలకు తమ బోగస్ ఓట్లు తొలగి పోతాయన్న భయం పట్టుకుంది. బెంగాల్, బాహార్‌లలో చొరబాటుదారులను ఓటర్లు చేర్చారు. అలా లక్షల్లో ఓట్లు చేరిపోయాయి. అందుకే ఎన్నికల సంఘం నిర్దాక్షిణ్యంగా వాటిని తొలగించింది. దీంతో ఆయా రాష్ట్రాల్లో నేతలు లబోదిబోమన్నారు. అర్హులు అనర్హులవటం, లేక ఇప్పుడు అనర్హులు భవిషత్తులో అర్హులవ్వటం జరగరాదు. ఓటరు మరణించినప్పుడు వాటిని తొలగగించాలి. అలాగే అనర్హులు లేదా ఇతర దేశీయులు ఉన్నప్పుడు కూడా వాటిని తొలగించాలి. అందుకే సర్ ప్రక్రియ అదే పనిచేస్తుంది. మరొక కారణం ఒక మనిషి పేరుమీద రెండు ఓట్లు ఉన్నప్పుడు. కూడా తొలగించడం సరైన చర్యనే. ఉమ్మడి ఎపిలో ఆంధ్రావాళ్లవి తెలంగాణలో కూడా ఓట్లు ఉండేవి. రెండు విడతల ఎన్నికలు జరిగినప్పుడు ఇక్కడా, అక్కడా ఓటేసిన సందర్భాలు కోకొల్లలు. ఇలాంటివి సహేతుకమైన కారణాలుగా గుర్తించి తొలగించాల్సి ఉంటుంది. వీటిమీద ఎవరికీ అభ్యంతరం వుండకూడదు. రాజకీయ పార్టీలు ఇలాంటి వారి విషయంలో సమాచారం అందచేయాలి. ఇటీవల ఎన్నికల సంఘం ఒక్క బెంగాల్ లో 90 లక్షల మందిని ఓటరు జాబితా నుంచి తొలగించింది. ఇందులో బంగ్లా నుంచి దొంగచాటుగా వచ్చిన వారే 90శాతం మంది ఉన్నారు. ఒక వ్యక్తికి ఒకటే ఆధార్ కార్డు, ఒకే పాన్‌కార్డు, ఒకే పాస్‌పోర్ట్ ఉంటుంది. వారి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వాడి, ఒక మనిషికి ఒకే ఓటు ఉండేలా చేయటం సాధ్యం అయ్యేదా అయినా ఎన్నికల సంఘం ఆధునిక సాంకేతికతను ఉపయోగించడం లేదు. ఓటరు తమ అడ్రస్‌ను మార్చుకునే వెసులబాటు ఉండాలి. ఆధార్, ఫోన్ నంబర్ లింక్ అయితే సమస్య రాదు. తాము జీవించి ఉన్నామని నిరూపించుకునే ఆన్‌లైన్ వెసులు బాటు కల్పించగలిగితే మరీ మంచిది. బ్యాంకు ఖాతా, పాన్‌కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేసినట్టు, ఓటరు కార్డు కూడా ఆధార్‌తో అనుసంధానం చేయడం ద్వారా దొంగ ఓట్లను అరికట్టవచ్చు. ఎన్నికల్లో బయోమెట్రిక్ ఆధారంగా ఓటు వేసే విధానం తీసుకురాగలిగితే ఇక పంచాయితీయే ఉండదు. ఇలా చేస్తే.. ఓటరు జాబితా వెరిఫికేషన్ పేరుతో ఎన్నికల సంఘం చేపడుతున్న సర్ ప్రక్రియ అవసరం రాకపోవచ్చు. ప్రజాస్వామ్య పక్రియను పూర్తిగా పటిష్ఠం చేయగలుగుతాం. రాష్ట్రాలు, రాజకీయ పార్టీలు కూడా ఇలాంటి అధునాతన ఆలోచనలకు పూనుకోవాలి. అప్పుడు ప్రక్షాళనతో పిలేకుండా మరణించిన వారి పేర్లను తొలగించటం సులభం కాగలదు. రెండు ఓట్లు కలిగి ఉన్న ఓటర్లు ఒకే ఓటు కలిగి ఉండేలా పక్కాగా ఓటరు కార్డును రూపొందించాలి. ఓటుకు పక్కాగా ఆధ్భార్ తరహాలో నంబర్ కేటాయించాలి. ఓటును తొలగించటం అనే అంశం మీద సరైన ఏకాభిప్రాయం, అవగాహన రాజకీయ పార్టీల్లోనే లేదు. అందువల్ల ముందుగా పక్కాగా ఓటు నమోదు జరగాలి. దానికి పక్కాగా కార్డు ఉండాలి. నంబరుతో కూడిన ఆధార్, పాన్ తరహా కార్డులను జారీచేయాలి. రాజకీయ పార్టీలు ఇందుకు సహకరించాలి. కానీ దొంగఓట్లకు అలవాటు పడ్డ పార్టీలు అందుకు ముందుకు రావడం లేదు. అందుకే సర్ ప్రక్రియ పేరు చెప్పగానే భయాందోళనలు వ్యక్తం చేస్తున్నాయి. ఓట్లు తొలగిస్తున్నారని అనుమానాలు రేకెత్తిస్తున్నాయి.

# ఆర్థిక పరిస్థితిపై దిగజారి మాట్లాడవద్దు

### కొత్త సిఎం విజయ్‌కు స్టాలిన్ హెచ్చరిక



చెన్నై,మే12 :తమిళనాడు నూతన ముఖ్యమంత్రిగా టీవీకే చీఫ్ జోసెఫ్ విజయ్ ప్రమాణ స్వీకారం చేసి 24 గంటలు గడవక ముందే ప్రతిపక్షాలు ఆయనపై విమర్శలకు దిగాయి. ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే చీఫ్ ఎంకే.స్టాలిన్ విజయ్ ప్రసంగాన్ని తప్పుబడుతూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ ఆర్థిక పనితీరును విమర్శించడంపై సీఎం విజయ్‌ను హెచ్చరించారు స్టాలిన్. అప్పులపై శ్వేతపత్రం విడుదల చేస్తామన్న విజయ్ మాటల్ని తప్పుబట్టిన ఆయన.. అబద్ధపు ప్రచారాలు ఆపాలంటూ చురకలంటించారు. 'ప్రభుత్వం వద్ద డబ్బులేదని వెంటనే చెప్పడం ప్రారంభించవద్దు. డబ్బు ఉంది.. కావాల్సింది దానిని ప్రజలకు ఇవ్వాలనే సంకల్పం, పాలించే సామర్థ్యం. ఐదేళ్లుగా కొవిడ్, వరదల వంటి సంక్షోభాలు సహా కేంద్ర బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో పోరాడుతూనే.. మేం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశాం. 'గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పును వదిలేసి ఖజానాను ఖాళీ చేసింది' అనే ఆరోపణను మీ మొదటి ప్రసంగంలోనే ప్రస్తావించారు. నిజానికి రాష్ట్రంలో అప్పు పరిమిత స్థాయిలోనే ఉంది. ఫిబ్రవరి బ్జడెట్‌లోనే మేం రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని స్పష్టంగా వివరించాం. ఆ విషయం మీకు తెలియదా? మీకు ఓటు వేసిన ప్రజలను మోసం చేసి.. విషయాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేయవద్దు! 'ఆచరణాత్మకంగా సాధ్యమయ్యే వాగ్దానాలు మాత్రమే ఇస్తాను' అని చెప్పి అధికారంలోకి వచ్చిన మీరు.. ఇప్పుడిప్పుడే ప్రభుత్వ పాలనను ప్రారంభిస్తున్నారు. మాలాగే మీరు కూడా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ఎలా నెరవేర్చాలనే మెళకువలను త్వరలోనే తప్పకుండా నేర్చుకుంటారని నమ్ముతున్నాను. మీకు ఓటు వేసిన ప్రజలతో పాటు నేనూ అదే ఆశిస్తున్నాను. మీ పాలనలో తమిళనాడు అభివృద్ధి ప్రస్థానం కొనసాగాలని మరోసారి నా శుభాకాంక్షలు!' అని తన సందేశాన్ని ముగించారు స్టాలిన్. కాగా.. కేంద్రంలో డీఎంకేకు చిరకాల మిత్రపక్షమైన కాంగ్రెస్ మద్దతుతో నిన్న(ఆదివారం) టీవీకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా సీఎం విజయ్‌కు ఎక్స్ వేదికగా హృదయపూర్వక అభినందనలు తెలిపారు స్టాలిన్. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే విజయ్ సంతకం చేసిన ప్రకటనలను కూడా ఆయన స్వాగతించారు. ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రాష్ట్రంలో మాదక ద్రవ్యాల నిరోధక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయడం వంటివి ప్రధాన ప్రకటనలలో ఉన్నాయి.

# రోగుల ప్రాణాలను కాపాడే యోధులు... నర్సులు

- సేవలో మానవత్వం... నర్సింగ్ వృత్తి గొప్పతనం
- సంతృప్తికర వైద్య సేవల్లో నర్సుల పాత్ర కీలకం
- వనరుల సద్వినియోగంతో ప్రైవేటుగా దీటుగా జీజీహెచ్ సేవలు
- త్వరలో అన్ని సమస్యలకూ పరిష్కారం
- ఎంపీ కేశినేని శివనాథ్



విజయవాడ,మే12 : రోగుల ప్రాణాలను కాపాడటంలో నర్సుల పాత్ర అత్యంత కీలకమని.. వైద్యులతో సమానంగా నర్సులు కూడా అహర్నిశలు కష్టపడుతూ రోగులకు ధైర్యం, భరోసా కల్పిస్తూ చక్కని చిరునవ్వుతో ఆత్మీయతతో రోగాన్ని దూరం చేస్తున్నారని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు.అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా మంగళవారం విజయవాడలోని న్యూ జీజీహెచ్‌లో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, శాసనసభ్యులు గద్దె రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. వైద్యరంగంలో కీలకమైన నర్సు వృత్తికి గౌరవాన్ని, హుందాతనాన్ని తీసుకొచ్చిన ఎ÷-లోరెన్స్ నైటింగేల్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ప్రజల ఆరోగ్యరక్షణలో నర్సులు అందించిన తోడ్పాటును ఈ సందర్భంగా స్మరించుకున్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.రిటైర్డ్ నర్సింగ్ సూపరింటెండెంట్ జి.అక్కమ్మ రూ. 50 వేలు అందించగా.. మరో లక్షా యాభైవేలు నర్సింగ్ అసోసియేషన్ ద్వారా సమకూర్చి ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.÷ార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ అందుబాటులో ఉన్న వనరులు, సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూనే జీజీహెచ్ ద్వారా అందించే వైద్య సేవల్లో 80 శాతానికి పైగా సంతృప్తి స్థాయి నమోదుకావడంలో నర్సుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఆసుపత్రితో పాటు నర్సింగ్ కళాశాల, వసతి గృహానికి సంబంధించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని.. త్వరలోనే ఇవి పరిష్కారమవుతాయన్నారు. ఆసుపత్రిలో ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా క్లిష్టమైన శస్త్రచికిత్సలు నిర్వహించి రోగుల మన్ననలు పొందుతోందని.. ప్రభుత్వ చొరవతో పాటు సీఎస్ఆర్, దాతల సహకారంతోనూ ఆసుపత్రి అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. శాసనసభ్యులు గద్దె రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. ఎ÷-లోరెన్స్ నైటింగేల్ సేవలు చిరస్మరణీయమని, ఆమె చూపిన సేవా మార్గం నేటికీ నర్సింగ్ వృత్తికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకుని మరింత మానవీయ దృక్పథంతో, ఆప్యాయతతో రోగులకు సేవలందించినప్పుడే ఆమెకు నిజమైన నివాళులు అర్పించినవారమవుతామని తెలిపారు. రాత్రీపగలు రోగుల్ని కంటికి రెప్పలా చూసుకుంటూ రోగాన్ని నయం చేసి ఇళ్లకు క్షేమంగా పంపిస్తూ నర్సులు ఆదరాభిమానాలు పొందుతున్నారని పేర్కొన్నారు. కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ సాధనలో వైద్య సేవల్లో నాణ్యత అత్యంత ముఖ్యమని.. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అత్యంత నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు, ఆరోగ్య ఆంధ్ర సాధనకు విశేష కృషిచేస్తోందని పేర్కొన్నారు. ఏ ఆసుపత్రిలో లేనివిధంగా ఇక్కడ ఓపీ ఉంటోందని.. ఇక్కడ అందుతున్న నాణ్యమైన సేవలకు ఇది నిదర్శనమన్నారు. ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్‌లో 95 శాతానికిపైగా సంతృప్తి స్థాయి లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. అన్ని విభాగాలూ అధికారులు, సిబ్బంది సమష్టిగా పనిచేసినప్పుడే ఈ లక్ష్యాన్ని చేరుకోగలమని పేర్కొన్నారు. ప్రత్యేకంగా అత్యవసర పరిస్థితులు, క్లిష్ట సమయాల్లో నర్సులు చూపించే అంకితభావం, సహనం, సేవా దృక్పథం సమాజానికి ఆదర్శమని తెలిపారు. రోగులు త్వరగా కోలుకోవడంలో నర్సుల సంరక్షణ, మానసిక ధైర్యం ఎంతో ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ఎపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ వైద్య రంగంలో నర్సులు అందిస్తున్న సేవలు అమూల్యమని.. రోగుల ఆరోగ్య పరిరక్షణలో వైద్యులతో సమానంగా నర్సులు కూడా అహర్నిశలు కష్టపడుతూ సేవలందిస్తున్నారని కొనియాడారు. సేవాభావం, సహనం, మానవత్వంతో నిండిన నర్సింగ్ వృత్తి సమాజానికి ఆదర్శప్రాయమని తెలిపారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి సేవలందించిన నర్సుల త్యాగాలను సమాజం ఎప్పటికీ మరవదని తెలిపారు. నర్సింగ్ సిబ్బంది సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించినట్లు విద్యాసాగర్ వెల్లడించారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మొత్తం 35 మందిని గౌరవ అతిథులు సత్కరించారు. విధి నిర్వహణలో వీరు అందించిన సేవలను ఈ సందర్భంగా అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. ఎ.ఏడుకొండలరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కృష్ణారావు, జిల్లా నర్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు క్షమాబేగం, కోశాధికారి కె.శివలీల, ఏపీ ఎన్‌జీజీవో జిల్లా అధ్యక్షకార్యదర్శులు డీఎస్ఎన్ రెడ్డి, పి.రమేష్, నగరశాఖ అధ్యక్షులు సీవీఆర్ ప్రసాద్, ఆసు పత్రి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జవాబుదారీదనం లేని ప్రధాని ప్రసంగం




- ఇలాంటి వారు దేశాన్ని నడపడం కష్టం
- ఎక్స్ వేదికగా రాహుల్ విమర్శలు

న్యూఢిల్లీ,మే12 : కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. మోదీ జవాబుదారీతనాన్ని కోల్పోయారని అన్నారు. ప్రజలు ఏం కొనాలో.. ఏం కొనకూడదో చెప్పే పరిస్థితికి మోదీ వచ్చారంటూ మండిపడ్డారు. తెలంగాణ సభలో మోదీ చెప్పినవి ప్రబోధాలు కావని, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు అని అన్నారు. రాజీపడిన ప్రధాని మోదీ.. దేశాన్ని నడపడం కష్టమన్నారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో సోమవారం ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. ప్రతిసారీ బాధ్యతను ప్రజలపైనే నెట్టేస్తున్నారని, ఆయన మాత్రం జవాబుదారీతనం నుంచి తప్పించుకు తిరుగు తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో బీజేపీ భారీ బహిరంగ సభ నిర్వహించింది. ఈ బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం దేశంపై తీవ్రంగా ఉందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్, యూరియా ధరలు అమాంతం పెరిగాయని తెలిపారు. రెండు నెలల నుంచి ప్రజలపై భారం పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, యుద్ధం కారణంగా వచ్చే నష్టాన్ని కేంద్రమే భరిస్తోందని వెల్లడించారు. క్లిష్ట సమయంలో దేశ ప్రజలు పెట్రోల్, డీజిల్ పరిమితంగా వినియోగించాలని కోరారు. ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలని.. వర్క్‌ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ మీటింగ్‌లు పెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా రవాణాను వినియోగించాలన్నారు. ఇవన్నీ కూడా ప్రజలను అప్రమత్తం చేసేవిగా లేవని రాహుల్ అన్నారు. కేవలం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నమని అన్నారు.

# అసోం సిఎంగా హిమంత బిశ్వశర్మ

- ప్రమాణ కార్యక్రమానికి ప్రధాని హాజరు
- ఎన్‌డి ముఖ్యమంత్రుల్లో చంద్రబాబు రాక







గౌహతి,మే12 : అస్సాం ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వశర్మ ప్రమాణస్వీకారం చేశారు.అస్సాంలో వరుసగా రెండోసారి సీఎం పదవిని చేపట్టిన తొలి భాజపా నేతగా హిమంత నిలిచారు. ఆయనతో పాటు మరో నలుగురు మంత్రులు ప్రమాణం చేశారు. ఉదయం 11.40 గంటలకు గువాహటిలోని వెటర్నరీ కాలేజీ ఫీల్డ్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. బిశ్వ శర్మతో పాటు బీజేపీ నుంచి ఇద్దరు, ఏజీపీ, బీపీఎఫ్ నుంచి ఒక్కొక్కరు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. అస్సాంలో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావడం ఇది వరుసగా మూడోసారి కాగా, అసోం ముఖ్యమంత్రిగా శర్మ పగ్గాలు చేపట్టడం రెండోసారి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, పలువురు కేంద్ర మంత్రులు, ఆంధప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ సహా పలువురు ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులు హాజరయ్యారు.హిమంత బిశ్వ శర్మతో పాటు రామేశ్వర్ తేలి, అతుల్ బోరా, చరణ్ బోరో, అజంతా నియోగ్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, కొత్త టీమ్‌తో కలిసి పూర్తి అంకితభావంతో పటిష్టమైన, మరింత అభివృద్ధి చెందిన, సుసంపన్నమైన అస్సాంను నిర్మిస్తామని శర్మ ప్రకటించారు. హిమంత బిశ్వ శర్మ తొలిసారి 2021లో సీఎంగా ప్రమాణ స్వీకారం చేసారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించి వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చింది. మొత్తం 126 స్థానాల్లో ఎన్డీయే 102 సీట్లు గెలుచుకుంది. బీజేపీ 82 సీట్లు దక్కించుకోగా, భాగస్వామ్య పార్టీలైన ఏజీపీ, బీపీఎఫ్ చెరో 10 సీట్లు గెలుచుకున్నాయి. కాంగ్రెస్ సారథ్యంలోని కూటమికి 19 సీట్లు వచ్చాయి. భాజపా ఒక్కటే 82 సీట్లు గెలుచుకోగా.. దాని కూటమి భాగస్వాములైన ఏజీపీ, బీపీఎఫ్ చెరో 10 సీట్లు దక్కించుకున్నాయి. దీంతో ఎన్డీఏ రాష్ట్రంలో వరుసగా మూడోసారి తమ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. ఈ కార్యక్రమానికి ముందు వేదిక వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తచ్చాడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. తనిఖీ చేయగా అతడి వద్ద తుటాలు లభ్యమయ్యాయి. వెంటనే అనుమానితుడిని బసిస్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టామన్నారు. హిమంత ప్రమాణస్వీకార కార్యక్రమానికి పీఎం మోదీ సహా పలువురు కీలక నేతలు హాజరైన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

# లక్షల మంది విద్యార్థుల కలలు కల్లలు

### నీట్ పరీక్ష రద్దుపై మండిపడ్డ రాహుల్

న్యూఢిల్లీ,మే12 : నీట్ ప్రశ్నాపత్రం లీక్ కారణంగా నీట్ పరీక్ష రద్దు కావడంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని లక్షల మంది కష్టాన్ని, కలల్ని బీజేపీ ప్రభుత్వం ఛిద్రం చేసిందని విమర్శించారు. ఇది కేవలం పరిపాలనా వైఫల్యం మాత్రమే కాదని, యువత భవిష్యత్తును కాలరాసే నేరమని ఆరోపించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో రాహుల్ గాంధీ ఓ ట్వీట్ చేశారు. దేశవ్యాప్తంగా 22 లక్షల మందికి పైగా విద్యార్థుల కష్టం, తల్లిదండ్రుల త్యాగాలు, ఎన్నో కుటుంబాల ఆశలు ఈ అవినీతి పాలన వల్ల నాశనమయ్యాయని రాహుల్ గాంధీ అన్నారు. కొంతమంది తండ్రులు అప్పులు చేశారని, తల్లులు తమ నగలు అమ్మారని, లక్షలాది మంది విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదివారని, అయితే పేపర్ లీకులు, ప్రభుత్వ నిర్లక్ష్యం, విద్యా వ్యవస్థలో అవినీతి వారికి శాపంలా మారాయని విమర్శించారు. ప్రతిసారి పేపర్ మాఫియా తప్పించుకుంటోందని, నిజాయతీగా చదివిన విద్యార్థులే శిక్ష అనుభవిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కష్టం కాదు.. డబ్బు, పరిచయాలే భవిష్యత్తును నిర్ణయిస్తే విద్యకు అర్థమేంటి? ప్రధాని చెప్పే అమృత కాలం దేశ యువతకు విష కాలంగా మారింది' అని రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత తీసుకురావాలని, పరీక్షల నిర్వహణలో కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.





## బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో ప్రవేశాలకు విద్యార్థుల ఎంపిక.

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

2026-27 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ పథకంలో భాగంగా పాఠశాలల్లో ప్రవేశాల కోసం మంగళవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధ్యక్షతన డ్రా పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేశారు. 3వ, 5వ, 8వ తరగతులలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధ్యక్షతన పరిశీలించి, గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఎస్టీ కేటగిరీలో సీట్లకు తల్లిదండ్రుల సమక్షంలో డ్రా నిర్వహించారు.

ఈ సందర్భంగా 3వ తరగతికి ముగ్గురు అబ్బాయిలు, ఒక అమ్మాయి, 5వ తరగతికి ఒక అబ్బాయి, ఒక అమ్మాయి, 8వ తరగతికి ఒక అబ్బాయిని ఎంపిక చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు త్వరలో కౌన్సిలింగ్ నిర్వహించి, సంబంధిత ధ్రువపత్రాలను పరిశీలించిన అనంతరం ప్రవేశాలు కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, గిరిజన అభివృద్ధి శాఖ అధికారి సంగీత, తదితరులు పాల్గొన్నారు.



## కొండగట్టు అంజన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

పెద్ద హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారిని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు.

పూజా కార్యక్రమాల అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ధర్మానికి ప్రతీకగా, అచంచలమైన భక్తికి, సేవాభావానికి నిలువెత్తు రూపంగా నిలిచిన ఆంజనేయ స్వామి వారి కృపాకటాక్షాలు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని మనసారా ప్రార్థించినట్లు తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని, ముఖ్యంగా రైతాంగానికి సాగునీరు, పంట సమృద్ధి కలగాలని స్వామివారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు. హనుమంతుని నిస్వార్థ సేవ, శక్తి మరియు పట్టుదలను స్ఫూర్తిగా తీసుకుని, ప్రజాసేవలో మరింత నిబద్ధతతో ముందుకు సాగుతామని అన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## శతాధిక వృద్ధురాలు మల్లవ్వ కన్నుమూత..

**- రేపాక గ్రామంలో విషాదం**

**బలగం టివి, ఇల్లంతకుంట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు మీసాల (మందపెల్లి) మల్లవ్వ సోమవారం రాత్రి కన్నుమూశారు. ఆమె వయస్సు సుమారు 102 ఏళ్ల ఉంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఒక శతాబ్ద కాలానికి పైగా జీవించిన మల్లవ్వ, తన జీవితాంతం ఎంతో ఆరోగ్యంగా ఉండటం విశేషం.

సాధారణంగా వయసు పైబడిన వారిలో కంటిచూపు మందగించడం, పళ్ళు ఊడిపోవడం వంటివి చూస్తుంటాం, కానీ మల్లవ్వ విషయంలో అది భిన్నంగా ఉండేది. 102 ఏళ్ల వయసులో కూడా ఎంతో సులభంగా సూదిలో దారం ఎక్కించగలిగే వారు. అంతేకాకుండా మల్లవ్వ దంతాలు కూడా ఎంతో దృఢంగా ఉండటం అందరినీ ఆశ్చర్యపరిచేది. గత ఏడాది కాలంగా కొంత అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నప్పటికీ, అంతకుముందు వరకు ఎంతో చురుకుగా ఉండేవారు. మరణించిన మల్లవ్వకు నర్సయ్య, కనకయ్య అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. వందేళ్లకు పైగా నిండు జీవితాన్ని గడిపిన మల్లవ్వ మృతి పట్ల గ్రామస్థులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.



## అనంతారంలో ప్రమాదకరంగా ఉన్న హై ఓల్టేజ్ ఐరన్ పోల్స్ తొలగింపు

**బలగం, టీవీ ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామంలో హై ఓల్టేజ్ విద్యుత్ లైన్ కు సంభందించిన ఐరన్ పోల్స్ ప్రమాదకరంగా మారడం తో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో వాటిని తొలిగించి సిమెంట్ పోల్స్ ను వేయడం జరిగిందని స్థానిక సర్పంచ్ ఓల్లాల రజిత వెంకటేశం లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ప్రత్యేక ధన్యవాదలు తెలియజేసారు. ఈ కార్యక్రమం లో ఎడిఈ రాజలింగం, ఏఈ పద్మ, సిబ్బంది నరసింగం, తిరుపతి శేఖర్, నాయకులు రాజశేఖర్, నాగరాజు, లక్ష్మన్, చంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు



## ఉమ్మడి జిల్లా ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాలు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాలు మే 12 నుంచి ప్రారంభం కానున్నాయని క్రికెట్ అసోసియేషన్ ఇంచార్జ్ వంకాయల కార్తీక్ అన్నారు. మంగళవారం సిరిసిల్లలో పట్టణంలో ని ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కార్తీక్ మాట్లాడుతూ మే 12 నుంచి జూన్ 12, 2026 వరకు జరిగే ఈ శిబిరాల్లో అండర్-14, 16, 19, 23 విభాగాల్లో బాలురు, బాలికలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను గుర్తించి, వారికి క్రికెట్‌లో మెరుగైన నైపుణ్యాలను పెంపొందించేందుకు ఉమ్మడి జిల్లాలోని సిరిసిల్లతో పాటు జగిత్యాల, గోదావరిఖని, కరీంనగర్ కేంద్రాల్లో ఈ ఉచిత శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు . రాజన్న సిరిసిల్ల జిల్లాకు సంబంధించి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిపుణుల పర్యవేక్షణలో ఈ శిక్షణ కొనసాగుతుందని అన్నారు .?ఈ శిబిరాల్లో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డుతో పాటు వైట్ డ్రెస్ ధరించి హాజరు కావాలని, మైదానంలోనే తమ పేర్లను నమోదు చేసుకోవాలని, జిల్లాలోని యువ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మాతృత్వ మరణాల నివారణకు సమిష్టిగా కృషి చేయాలి..

**- డీఎంహెచ్వో డాక్టర్ రజిత**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**



జిల్లాలోని గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి, మాతా శిశు సంరక్షణలో జిల్లాను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలపాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత పిలుపునిచ్చారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో కార్మిక ఆరోగ్య కేంద్రాల ఆశా నోడల్ పర్సన్లతో డిఎంహెచ్వో డాక్టర్ రజిత సమీక్షా సమావేశం నిర్వహించారు .

ఈ సందర్భంగా డిఎంహెచ్వో డాక్టర్ రజిత మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో గర్భిణీలను సకాలంలో గుర్తించి వారికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా హైరిస్క్ గర్భిణీలను గుర్తించి, వారిలో రక్తహీనత సమస్య తలెత్తకుండా ఐరన్ మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు . ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచి, సాధారణ ప్రసవాలు జరిగేలా గర్భిణీలకు అవగాహన కల్పించాలని అన్నారు . కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకాల లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని, విధుల్లో అలసత్వం వహించకుండా పని చేయాలని అన్నారు . ఈ సమీక్షా సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులతో పాటు డాక్టర్ సంపత్ కుమార్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ అనిత, సి. హెచ్.ఓ శాంత, డి.డి.ఎం కార్తీక్, డిప్యూటీ డెమో రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బండి భగీరథను కాపాడుతున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే...

**-మున్సిపల్ మాజీ చైర్పర్సన్ రామతీర్థపు మాధవి**

**బలగం టీవీ, వేములవాడ**



కాంగ్రెస్ పార్టీ మహిళా మంత్రులు బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ ఫోక్సో కేసు వ్యవహారంలో మౌనం ఎందుకు పాటిస్తున్నారో తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని వేములవాడ మున్సిపల్ మాజీ చైర్పర్సన్ రామతీర్థపు మాధవి అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని బి ఆర్ ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మి నరసింహరావు నివాసంలో పార్టీ కౌన్సిలర్లు, నాయకులతో కలిసి రామతీర్థపు మాధవి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామతీర్థపు మాధవి మాట్లాడుతూ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ పై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంపై తెలంగాణలో బిజెపి, కాంగ్రెస్ పార్టీల దోస్తానా బయటపడిందన్నారు.

ఫోక్సో కేసు వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర మంత్రి బండి సంజయ్, కుమారుడిని కాపాడుతుందని ఆరోపించారు. మహిళలే టార్గెట్ గా బండి భగీరథ ప్రవర్తనలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయన్నారు. పుట్టుకల గురించి మాట్లాడే బండి సంజయ్ తన కుమారుడిని మాత్రం వక్ర బుద్ధితో పెంచారని, కనీసం చేసిన తప్పుని, తప్పుగా ఒప్పుకోకుండా కొడుకును కాపాడే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. మంత్రి కొండా సురేఖ, సీతక్కలు. పోక్సో నిందితుడు బండి భగీరథ విషయంలో మౌనం ఎందుకు పాటిస్తున్నారో ప్రజలకు తెలుసని, మైనర్ ఆడబిడ్డకు అన్యాయం జరుగుతే స్పందించక పోవడం సిగ్గుచేటన్నారు. బండి భగీరథ దేశం నుంచి పారిపోకుండా లుక్ ఔట్ నోటీసులు జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లు వెంగళ అనిత, మహిళా నాయకురాలు జంగిటి శ్రీనిధి, మామిండ్ల జమున, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రామతీర్థపు రాజు, నిమ్మశెట్టి విజయ్, వెంగళ శ్రీకాంత్ గౌడ్, సిరిగిరి చందు, మారం కుమార్, గోలి మహేష్, కొండ కనుకయ్య, నీలం శేఖర్, అంజద్ పాషా, లైసెట్టి మల్లేశం, గూడూరు మధు, ఉల్లెందుల హనుమంతు, నిమ్మశెట్టి రాజు, గోసుకుల నరసయ్య, సంజీవ్, మంత సందీప్, సత్తిరెడ్డి, రాపెల్లి రాంబాబు, మామిండ్ల కనకయ్య, పెద్ది రాజు, రఫిక్, అసద్, షాహిద్, పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు...

## బండి సంజయ్ వెంటనే రాజీనామా చేయాలి..

**-జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత**




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత నలినీకాంత్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వనిత నలినీకాంత్ మాట్లాడుతూ ఒక మైనర్ బాలికపై అనుచిత ప్రవర్తనకు పాల్పడ్డారన్న ఆరోపణల నేపథ్యంలో, ఆయన నైతిక బాధ్యత వహించి తక్షణమే పదవి నుంచి తప్పుకోవాలని అన్నారు . ఈ ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితురాలికి న్యాయం చేయడంతో పాటు దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

?మహిళల భద్రత విషయంలో కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడదని, బాధితులు న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించినప్పుడు అధికార బలాన్ని చూపి వారిని ఇబ్బందులకు గురిచేయడం సరైన పద్ధతి కాదని అన్నారు . మహిళా సమస్యల గురించి మాట్లాడే బీజేపీ మహిళా నేతలు, సొంత పార్టీ నేతపై ఇన్ని ఆరోపణలు వస్తున్నా స్పందించకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వెలుమల స్వరూప, జిల్లా ప్రధాన కార్యదర్శి కోడం అరుణ, సామల రోజా, వీర్నపల్లి మండల అధ్యక్షురాలు సుమలత, పుష్పలత, సత్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పాంబండ వద్ద ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

**అంగరంగ వైభవంగా సువర్చల సహిత ఆంజనేయ స్వామి కళ్యాణం**

**తండోపతండాలుగా తరలివచ్చిన భక్తులు..**

**ఆలయంలో ప్రత్యేక హోమాలు**

**బలగం టీవీ, చిగురుమామిడి**



చిగురుమామిడి మండల కేంద్రంలోని పాంబండ క్షేత్రం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. పాంబండ వద్ద వెలిసిన పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం, అలాగే పెద్ద హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం ఆలయంలో వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలను తిలకించేందుకు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

**శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు:**

ఉదయం నుండే ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అర్చకుల వేదమంత్రోచ్చారణల మధ్య మంటపారాధనలు, నిత్య హోమాలు నిర్వహించారు. ప్రధాన ఘట్టమైన సువర్చల సహిత ఆంజనేయ స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని భక్తుల జయజయధ్వానాల మధ్య శాస్త్రోక్తంగా జరిపారు.

**భక్తిశ్రద్ధలతో పారాయణాలు:**

మధ్యాహ్నం భక్తులందరికీ భారీ స్థాయిలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం, చతుస్థానార్చన, మూలమంత్ర, మూర్తి మంత్ర హోమాలు నిర్వహించారు. భక్తులందరూ సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయణం చేయడంతో పాంబండ గిరులు మారుమోగాయి. చివరగా పూర్ణాహుతితో వేడుకలు సంపూర్ణమయ్యాయి.

**పీఠాధిపతుల పర్యవేక్షణ:**

పాంబండ పంచముఖ ఆంజనేయ స్వామి పీఠాధిపతి గురు ఉమేష్ స్వామీజీ ఆధ్వర్యంలో ఈ వేడుకలన్నీ ఘనంగా జరిగాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు. వేసవి తీవ్రత దృష్ట్యా భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక వసతులు కల్పించారు.

## చిన్నకల్వలలో కన్నుల పండువగా హనుమాన్ జయంతి



**సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా విశేష పూజలు**

**ఆకట్టుకున్న ఆకుపూజ, పుష్పయాగం.. భక్తులతో పోటెత్తిన ఆలయం**

**బలగం టీవీ, సుల్తానాబాద్**

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల గ్రామంలో ఆధ్యాత్మిక ఉత్సాహం ఉప్పొంగింది. గ్రామస్థుల ఆరాధ్య దైవమైన శ్రీ సీతారామచంద్రస్వామి, సంకట వియోచన రామభక్త వీర హనుమాన్ బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన హనుమాన్ జయంతి వేడుకలను వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కన్నుల పండువగా నిర్వహించారు.

**ఆధ్యాత్మిక కార్యక్రమాల సమాహారం:**

జయంతిని పురస్కరించుకొని తెల్లవారుజాము నుండే ఆలయంలో విశేష పూజలు ప్రారంభమయ్యాయి. స్వామివారికి అభిషేకం, అత్యంత భక్తిశ్రద్ధలతో ఆకు పూజ నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, చక్రస్నానం, ద్వాదశరాధన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. సాయంత్రం జరిగిన పుష్పయాగం, సప్త వర్ణ సేవ, వసంతోత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఉత్సవాలను దిగ్విజయంగా నిర్వహించిన వేద పండితులను ఆలయ కమిటీ ఘనంగా సన్మానించింది.

**భారీగా తరలివచ్చిన భక్తులు:**

బ్రహ్మోత్సవాల నేపథ్యంలో చిన్నకల్వల గ్రామం భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తుల సౌకర్యార్థం భక్త మండలి ఆధ్వర్యంలో భారీగా అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ వేడుకల్లో ప్రముఖులు వంగపల్లి అనసూయదేవి, సుగుణాకర్ రావులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. జై హనుమాన్ స్మరణలతో గ్రామం మారుమోగింది.

# బండి భగీరథ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలి




- ఐద్వా అఖిల భారత ఉపాధ్యక్షురాలు ఎస్. పుణ్యవతి
- ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఐద్వా రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో నిరసన

**బలగం టీవి, హైదరాబాద్**

బీజేపీ నేత, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో వెంటనే అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలని ఐద్వా అఖిల భారత ఉపాధ్యక్షురాలు ఎస్. పుణ్యవతి డిమాండ్ చేశారు. అలాగే బండి సంజయ్‌ను కేంద్ర మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పాత్రపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఐద్వా రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు అధ్యక్షత వహించగా, ఐద్వా అఖిల భారత ఉపాధ్యక్షురాలు పాల్గొని మాట్లాడారు.

బాలికపై లైంగికదాడి చేసి అనంతరం బెదిరింపులు, కేసు సెటిల్‌మెంట్ ప్రయత్నాలు జరగడం అత్యంత దారుణమన్నారు. 'బేటీ బచావో-బేటీ పడావో' అంటూ నినాదాలు చేసే బీజేపీ నాయకత్వం మహిళలపై జరుగుతున్న లైంగికదాడుల విషయంలో మాత్రం నేరస్తులను కాపాడే సంస్కృతిని ప్రోత్సహిస్తోందని విమర్శించారు. బిల్కిస్ బాను కేసు నుంచి దేశవ్యాప్తంగా మహిళలు, చిన్నారులపై జరుగుతున్న దాడుల వరకు బీజేపీ పాలనలో మహిళా వ్యతిరేక ధోరణి పెరిగిందని తెలిపారు. కేంద్ర మంత్రి పదవిలో ఉన్న బండి సంజయ్ తన కుమారుడిపై వచ్చిన తీవ్రమైన ఆరోపణలను సమర్థిస్తూ వెనుకేసుకురావడం దుర్మార్గం అన్నారు.

ఐద్వా జాతీయ నాయకులు టి.జ్యోతి మాట్లాడుతూ పోక్సో కేసు నమోదై నాలుగు రోజులు గడిచినా నిందితుడిని అరెస్టు చేయకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని విమర్శించారు. బాలికపై లైంగిక దాడి జరిగినా ప్రభుత్వం, పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోకుండా బండి సంజయ్ కుటుంబానికి కొమ్ముకాస్తున్నట్టు కనిపిస్తోందన్నారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్. అరుణ జ్యోతి మాట్లాడుతూ అధికార అహంకారంతో తన కుమారుడు చేసిన నేరాన్ని కప్పిపుచ్చుకునేందుకు బండి సంజయ్ ప్రయత్నిస్తున్నారని, ఇది మహిళల భద్రతను తాకట్టు పెట్టడమేనన్నారు. పోక్సో వంటి తీవ్రమైన కేసు నమోదైనా బీజేపీ నాయకత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. దేశంలో చట్టాన్ని కాపాడాల్సిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి ఇంట్లోనే చట్టాన్ని ఉల్లంఘించే పరిస్థితి నెలకొనడం సమాజానికి ప్రమాదకర సంకేతమని తెలిపారు. బండి సంజయ్ తక్షణమే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బాధిత బాలిక కుటుంబం ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు, ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమని మండిపడ్డారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ మాట్లాడుతూ బండి భగీరథ్‌పై గతంలో మహేంద్ర యూనివర్సిటీలో ర్యాగింగ్, డ్రగ్స్ వినియోగం వంటి ఆరోపణలు కూడా వచ్చాయని గుర్తుచేశారు. బాధిత కుటుంబానికి బెదిరింపులు వస్తున్న నేపథ్యంలో వెంటనే భద్రత కల్పించాలని, కేసుపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి బండి భగీరథ్‌ను అరెస్టు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, లేకపోతే డీజీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఐద్వా కేంద్ర కమిటీ సభ్యులు కె.ఆశాలత, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యాక్షులు కె.అశోక్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా ఐద్వా కార్యదర్శి వరలక్ష్మీ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు లెనిన్ గువేరా తదితరులు పాల్గొన్నారు.

# చంచల్‌గూడలో 'తెలంగాణ ప్రిజన్స్ మ్యూజియం' ప్రారంభం




- 'ఫీల్ ది జైల్' పేరుతో సామాన్యులకు జైలు అనుభవం.. ప్రారంభించిన గవర్నర్ శివప్రతాప్ శుక్లా
- శిక్షా కేంద్రాల నుంచి సంస్కరణా కేంద్రాలుగా జైళ్లు మార్పు.. జైళ్ల శాఖ వినూత్న ప్రయత్నం

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ జైళ్ల శాఖ చరిత్రలో ఒక వినూత్న అధ్యాయం మొదలైంది. చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో అత్యాధునిక వసతులతో ఏర్పాటు చేసిన "తెలంగాణ ప్రిజన్స్ మ్యూజియం"ను, అలాగే సామాన్యులకు జైలు జీవితంపై అవగాహన కల్పించే "ఫీల్ ది జైల్ ఎక్స్‌పీరియన్స్" కార్యక్రమాన్ని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా మంగళవారం ఘనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. ఒకప్పుడు జైళ్లు కేవలం కఠిన శిక్షలకు, శారీరక శ్రమకు వేదికలుగా ఉండేవని గుర్తుచేశారు. కానీ నేడు జైళ్లు సంస్కరణ, పునరావాసం, మానవ విలువలకు ప్రాధాన్యతనిచ్చే కేంద్రాలుగా రూపాంతరం చెందాయని ప్రశంసించారు. "ఈ మ్యూజియం గత కాలపు జైలు పరిస్థితులను, ఆధునిక సంస్కరణలను అద్భుతంగా ప్రతిబింబిస్తోంది. ఇది ప్రజల్లో చట్టాల పట్ల గౌరవం, బాధ్యతను పెంపొందిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు.

**మ్యూజియంలో ప్రత్యేకతలు:**

చారిత్రక సాక్ష్యాలు: పురాతన బ్యారక్కుల నమూనాలు, ఖైదీలకు వేసిన సంకెళ్లు, బేడీలు, ఉరిశిక్ష వేదికలు ఇక్కడ ప్రదర్శనకు ఉంచారు.

ఆడియో-విజువల్ గ్యాలరీ: జైలు జీవన వాస్తవాలను కళ్లకు కట్టేలా పెయింటింగ్స్, డిజిటల్ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

చారిత్రక విభాగం: 1961-68 మధ్య నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో ఖైదీలు పాలుపంచుకున్న చారిత్రక ఘట్టాలను ప్రత్యేకంగా ప్రదర్శిస్తున్నారు.

**రోజంతా జైలులో గడపవచ్చు:**

జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ.. ప్రజలకు జైలు క్రమశిక్షణ, నియమ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు 12 గంటలు లేదా 24 గంటల పాటు జైలులో గడిపే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఖైదీలకు అందించే ఆహారం, వసతిని అనుభవించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, దీని ఉద్దేశం శిక్ష కాదు, కేవలం సామాజిక అవగాహన మాత్రమేనని స్పష్టం చేశారు.

**బుకింగ్ సౌకర్యం:**

ఆసక్తి ఉన్న వారు www.telanganajailexperience.com వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చని ఆమె తెలిపారు. సందర్శకుల కోసం క్యాఫెటీరియా సౌకర్యం కూడా అందుబాటులో ఉంది. ఈ కార్యక్రమంలో ఐజీ ఎన్. మురళీ బాబు, డీఐజీ డాక్టర్ డి. శ్రీనివాస్, చంచల్‌గూడ సూపరింటెండెంట్ ఎన్. శివకుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# 'నీట్'ను ముంచిన ఎన్టీఏను తక్షణమే రద్దు చేయాలి

- సంతలో సరుకుల్లా ప్రశ్నపత్రాల విక్రయం.. 22 లక్షల మంది విద్యార్థుల భవితవ్యం ఏంటి?
- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామకృష్ణ ఆగ్రహం..
- విద్యానగర్‌లో రాస్తారోకో



**బలగం టీవి, హైదరాబాద్**

దేశవ్యాప్తంగా వైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహించిన 'నీట్' పరీక్షలో చోటుచేసుకున్న అక్రమాలపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. నీట్ పరీక్ష నిర్వహణలో విఫలమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)ని వెంటనే రద్దు చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం విద్యానగర్ చౌరస్తా వద్ద ఎన్టీఏకు వ్యతిరేకంగా విద్యార్థి సంఘాలతో కలిసి వారు రోడ్డుపై బైఠాయించి భారీ రాస్తారోకో నిర్వహించారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తుకు వెన్నెముక వంటి విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం, ఎన్టీఏ చెలగాటమాడుతున్నాయని మండిపడ్డారు. "నీట్ ప్రశ్నపత్రాలు సంతలో సరుకుల్లా అమ్ముడవుతున్నాయి. కష్టపడి చదివిన 22 లక్షల మంది విద్యార్థులు నేడు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పేపర్ లీక్ ఆరోపణలు, అక్రమాల వల్ల లక్షలాది మంది విద్యార్థులు మళ్లీ పరీక్ష రాయాల్సిన దుస్థితి కల్పించడం అన్యాయం" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామకృష్ణ మాట్లాడుతూ.. ఎన్టీఏ ఏజెన్సీ తన విశ్వసనీయతను పూర్తిగా కోల్పోయిందని విమర్శించారు. పరీక్ష నిర్వహణలో పారదర్శకత లోపించిందని, అక్రమాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. తక్షణమే ఎన్టీఏను రద్దు చేసి, బాధ్యులపై విచారణ జరిపించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.విద్యానగర్ చౌరస్తాలో జరిగిన ఈ రాస్తారోకోతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. విద్యార్థులు, నాయకులు కేంద్ర ప్రభుత్వానికి, ఎన్టీఏకు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నేతలు నందగోపాల్, సాయి, సతీష్, ప్రవీణ్, హరి శంకర్, వినయ్, వినోద్ తదితరులు పాల్గొని తమ నిరసనను తెలియజేశారు.

# 'గాంధీ'లో ఫైర్ సేఫ్టీ అవేర్‌నెస్, మాక్ ఎవాక్యుయేషన్ డ్రిల్



**బలగం టీవి, హైదరాబాద్**

సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో మంగళవారం హైకోర్టు అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ వి.భాను ప్రతాప్ ఆధ్వర్యంలో సమగ్ర ఫైర్ సేఫ్టీ అవేర్‌నెస్ ప్రోగ్రాం, మాక్ ఎవాక్యుయేషన్ డ్రిల్‌ను విజయవంతంగా నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు, విపత్తు పరిస్థితుల్లో సమర్థవంతమైన ప్రతిస్పందనను నిర్ధారించడానికి ఆస్పత్రి సిబ్బంది, విద్యార్థులు, సహాయక సిబ్బందిలో అగ్నిమాపక భద్రతా అవగాహన, అత్యవసర సంసిద్ధత, రెస్క్యూ మెళుకువలు, తరలింపు విధానాలను పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాణితోపాటు 20 మంది పీజీ విద్యార్థులు, 20 నర్సింగ్ సిబ్బంది, 20 మంది భద్రతా సిబ్బంది, 15 మంది పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. అవగాహనా సదస్సులో మలక్‌పేట స్టేషన్ ఫైర్ ఆఫీసర్ మహ్మద్ ఎల్పీజీ సిలిండర్ మంటలు, అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థలు, ప్రథమ చికిత్స పద్ధతులు, రెస్క్యూ మెళుకువలు, అగ్ని ప్రమాదాల సమయంలో అనుసరించాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై వివరణాత్మక ప్రదర్శనను అందించారు. పంజాగుట్ట స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పి.రమేష్, చాంద్రాయణగుట్ట స్టేషన్ ఫైర్ ఆఫీసర్ బిక్షపతి చమురు మంటలను నిర్వహించడంపై ఆచరణాత్మక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ అగ్నిమాపక పరికరాలు, కార్యాచరణ భద్రతా విధానాలను ఉపయోగించి వివిధ అగ్నిమాపక పద్ధతులను వివరించారు. సురక్షితమైన తరలింపు పద్ధతులు, అత్యవసర సమన్వయం, క్రౌడ్ మేనేజ్‌మెంట్, ప్రాణం, ఆస్తి రక్షణ కోసం అగ్ని ప్రమాదాల సమయంలో సకాలంలో ప్రతిస్పందనపై పాల్గొనే వారికి అవగాహన కల్పించడానికి ప్రత్యక్ష మాక్ ఎవాక్యుయేషన్ డ్రిల్ కూడా నిర్వహంచారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక ఔట్‌పోస్ట్ గాంధీ ఆస్పత్రి బందం, ముషీరాబాద్ అగ్నిమాపక కేంద్రం సిబ్బంది చురుకుగా పాల్గొని అవగాహనా కార్యక్రమాలు, ప్రదర్శనలు సజావుగా నిర్వహించడంలో సహకరించారు. అగ్ని ప్రమాదాల నివారణలో అప్రమత్తంగా ఉండాలనీ, అగ్నిమాపక భద్రతా నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి విజ్ఞప్తి చేశారు.

# భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలి..

- కలెక్టర్ గరిమ అగ్రవాల్



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

టీజీఈడబ్ల్యూఐడీసీ మరియు పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన భవన నిర్మాణ పనులు, వివిధ అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో టీజీఈడబ్ల్యూఐడీసీ, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారులతో కలిసి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎంశ్రీ, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు (ఏఏపీసీ), నాబార్డ్, ఎన్ఆర్ఈజీఎస్, సమగ్ర శిక్ష పథకాల కింద చేపట్టిన సైన్స్ ల్యాబ్‌లు, అదనపు తరగతి గదులు, ఇంకుడు గుంతలు, అంగన్‌వాడీ కేంద్రాలు మరియు టాయిలెట్ల నిర్మాణాల పురోగతిని మండలాల వారీగా సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ?ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రకటించిన 99 రోజుల కార్యాచరణలో విద్యాశాఖ వారోత్సవాలను షెడ్యూల్ ప్రకారం అత్యంత వైభవంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా విద్యాధికారి, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో టీజీఈడబ్ల్యూఐడీసీ ఆధ్వర్యంలో ఇప్పటికే 21 అదనపు తరగతి గదులు, ఇతర మరమ్మత్తు పనులు పూర్తయ్యాయని ఈ వారోత్సవాల సందర్భంగా వాటిని పండుగ వాతావరణంలో ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మంజూరైన నూతన భవనాలకు మరియు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నిర్వహించాలని పేర్కొన్నారు.

?వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు సిద్ధంగా ఉండాలని, ముఖ్యంగా టాయిలెట్ల నిర్మాణాలు మరియు తాగునీటి సౌకర్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు . విద్యాశాఖ మరియు ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పనులను తనిఖీ చేసి, నాణ్యతతో కూడిన పనులను నిర్ణీత గడువులోగా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

సమీక్షలో పంచాయతీ రాజ్ ఎస్ఈ గిరీష్ బాబు, టీజీఈ డబ్ల్యూఐడీసీ ఈఈ అశోక్ కుమార్, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, జీసీడీఓ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

# తండ్రి దినవారం రోజే కుమారుడి ఆత్మహత్య..




**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**

ఒకవైపు తండ్రిని కోల్పోయిన పుట్టెడు దుఃఖం.. మరోవైపు ఆ తండ్రి ఆత్మకు శాంతి చేకూరాలని నిర్వహిస్తున్న కర్మకాండలు.. ఆ ఇంట్లో బంధువులంతా విషాదంలో మునిగి ఉండగా, అదే రోజు ఆ ఇంటి పెద్ద దిక్కుగా ఉండాల్సిన కుమారుడు బలవన్మరణానికి పాల్పడటం అందరినీ కలిచివేసింది. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామంలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దోమల గ్రామానికి చెందిన పాముల భాస్కర్ ఆటో నడిపిస్తూ జీవనం కొనసాగిస్తున్నాను. పది రోజుల క్రితం తన తండ్రి మృతి చెందగా సోమవారం దినకర్మను నిర్వహించారు.సోమవారం రాత్రి ఇంట్లో బంధువులందరూ ఉన్న సమయంలోనే భాస్కర్ ఒక్కసారిగా కనిపించకుండా పోయాడు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు రాత్రంతా గ్రామ పరిసరాల్లో గాలించినా ఫలితం లేకపోయింది. చివరకు మంగళవారం వేకువజామున గ్రామ శివారులోని చెట్టుకు భాస్కర్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని,కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. తండ్రిని కోల్పోయిన విషాదం నుంచి కోలుకోకముందే, భాస్కర్ మరణంతో ఆ కుటుంబం వీధిన పడింది. భాస్కర్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు మరియు ఒక కుమారుడు ఉన్నారు.

# నేటి నుండి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

జిల్లాలో మే 13 నుండి 20వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సి.హెచ్. శరత్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డి ఐఈవో శరత్ కుమార్ మాట్లాడుతూ మొత్తం 4200 మంది విద్యార్థులు (ప్రథమ సంవత్సరం: 2599, ద్వితీయ సంవత్సరం: 1601) ఈ పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు . మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు, రెండో సంవత్సరం వారికి మధ్యాహ్నం 2:30 నుండి 5:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని అన్నారు . పరీక్షల నిర్వహణ కోసం 200 మంది ఇన్విజిలేటర్లు, ఇద్దరు సిట్టింగ్ స్క్వాడ్లు మరియు ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యుడిని నియమించినట్లు పేర్కొన్నారు.విద్యార్థులు తమ హాల్ టికెట్లను స్త్రఎఐవఅవష.ఎస్త్రస్త్ర.స్త్రశీఱ.ఱఅ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, వీటిపై ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేదని స్పష్టం చేశారు. హాల్ టికెట్‌పై ఉన్న క్యూఆర్ కోడ్ ద్వారా పరీక్షా కేంద్రం లొకేషన్‌ను సులభంగా తెలుసుకోవచ్చని అన్నారు .



# చెక్కులు పంపిణీ

**బలగం టీవి, బోయినిపల్లి;**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలోనీ రైతు వేదికలో కళ్యాణ లక్ష్మి,సీఎం సహాయనిధి,రైతు బీమా చెక్కులను మంగళవారం రోజున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మోయినోద్దీన్ మాట్లాడుతూ: మండలంలో 57 మందికి 57 లక్షల ఆరు వేల ఆరు వందల పన్నెండు రూపాయల కళ్యాణ లక్ష్మి చెక్కులు, 130 మందికి 35 లక్షల 54 వేల 2 వందల రూపాయల సిఎం సహాయ నిధి చెక్కులను,5 మందికి రైతు బీమా చెక్కులను అందజేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటినుండి ఇప్పటివరకు 287 కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే వివిధ కారణాలతో చనిపోయిన ఐదుగురికి రైతు బీమా కింద ఐదు లక్షల రూపాయలు చొప్పున చెక్కులను అందజేసినట్లు తెలిపారు. అనారోగ్య కారణాలతో ఆసుపత్రులలో చికిత్స పొంది, దరఖాస్తు చేసుకున్న పలువురికి సీఎం సహాయని చెక్కులను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎం.సి చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, సర్పంచ్ నల్లమోహన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టపల్లి సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సర్పంచ్ భీంరెడ్డి మహేశ్వర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ముదిగంటిసురేందర్ రెడ్డి, ఏఎంసి చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, ఎంపీడీవో జయశీల. ఆర్ఐ మనోజ్ కుమార్, ఏవో ప్రణీత, ఆయా గ్రామాల సర్పంచులు, జిపిఓలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# బండి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలి

- కేంద్ర మంత్రి పదవి నుంచి బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలి
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ
- ట్యాంక్ బండ్ వద్ద సీపీఐ నేతల నల్ల చొక్కాల నిరసన..




**బలగం టీవి, హైదరాబాద్**

బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ డిమాండ్ చేశారు. బాధ్యతాయుతమైన కేంద్ర మంత్రి పదవిలో ఉండి, నిందితుడిని వెనకేసుకొస్తున్న బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని ఆయన కోరారు. మంగళవారం సీపీఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్ వద్ద ఉన్న డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట నాయకులు, కార్యకర్తలు నల్ల చొక్కాలు, నల్ల చీరలు ధరించి భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు.

ఈ సందర్భంగా ఈ.టి.నరసింహ మాట్లాడుతూ.. బండి భగీరథ్‌పై కేసు నమోదై 36 గంటలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. "పోక్సో కేసుల్లో 24 గంటల్లోనే నిందితులను రిమాండ్ చేసిన చరిత్ర పోలీసులకు ఉంది. కానీ ఇప్పుడు నిందితుడు పరారీలో ఉన్నాడని, ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుందని చెప్పడం హాస్యాస్పదం. ఉద్దేశపూర్వకంగానే అతడిని కాపాడే ప్రయత్నం జరుగుతోంది" అని విమర్శించారు.

దేశవ్యాప్తంగా బీజేపీ నాయకులు అనేక లైంగిక దాడి కేసుల్లో ఇరుక్కున్నారని నరసింహ ఆరోపించారు. డేరా బాబా, బ్రిజ్ భూషణ్ సింగ్, కుల్దీప్ సింగర్ వంటి వారిని బీజేపీ కాపాడుతోందని, రేపిస్టులకు మద్దతుగా ర్యాలీలు తీసిన నీచ చరిత్ర ఆ పార్టీదని మండిపడ్డారు. గతంలో భగీరథ్ అనేక కేసుల్లో ఇరుక్కున్నా బండి సంజయ్ బుద్ధి చెప్పకపోవడం వల్లే నేడు మైనర్ బాలికపై అత్యాచారానికి ఒడిగట్టాడని దుయ్యబట్టారు.

బీసీల పేరిట డ్రామాలు: పార్లమెంటులో బీసీల రిజర్వేషన్ల గురించి మాట్లాడని బండి సంజయ్, ఇప్పుడు తన కొడుకును కాపాడుకోవడానికి బీసీ కార్డు వాడటం సిగ్గుచేటు. ఇది కుటుంబ విషయమని బీజేపీ నేత రామచంద్రరావు అనడం వారి దుర్మార్గమైన నీతికి నిదర్శనం. చిన్న విషయాలకే గొడవ చేసే బీజేపీ నేతలు, ఇప్పుడు రేపిస్టుకు ఉరిశిక్ష వేయాలని ఎందుకు రోడ్లపైకి రావడం లేదు? వచ్చే 24 గంటల్లో నిందితుడిని అరెస్టు చేయకపోతే డీజీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఈ సందర్భంగా సీపీఐ హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు పి.ప్రేమ్ పావని, ఎస్.ఛాయాదేవి, స్టాలిన్, జి.చంద్రమోహన్ గౌడ్, నెర్లకంటి శ్రీకాంత్, మారుపాక అనిల్ మరియు భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## సన్‌రైజర్స్ 'రన్' కరువు..

# గుజరాత్ 'టైటాన్' విజయం

- 83 పరుగుల తేడాతో హైదరాబాద్ ఘోర పరాజయం.. ప్లే ఆఫ్స్‌కు చేరువైన గుజరాత్
- నిప్పులు చెరిగిన రబడా, హోల్డర్..
  చేతులెత్తేసిన రైజర్స్ బ్యాటర్లు



**బలగం టీవీ, అహ్మదాబాద్**

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ కథ అడ్డదిడ్డంగా మారింది. మంగళవారం అహ్మదాబాద్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన పోరులో ఆరెంజ్ ఆర్మీ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పూర్తిగా విఫలమైన హైదరాబాద్ 83 పరుగుల భారీ తేడాతో చిత్తు అయింది. ఈ విజయంతో గుజరాత్ టైటాన్స్ 8 విజయాలతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకోవడమే కాకుండా, ప్లే ఆఫ్స్ బెర్త్‌ను దాదాపు ఖరారు చేసుకుంది.

**సాయి, సుందర్ ధాటి:**

టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. ఓపెనర్ సాయి సుదర్శన్ (44 బంతుల్లో 61; 5 ఫోర్లు, 2 సిక్సర్లు) క్లాస్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకోగా, వాషింగ్టన్ సుందర్ (33 బంతుల్లో 50; 7 ఫోర్లు, 1 సిక్సర్) మెరుపు హాఫ్ సెంచరీతో స్కోరు బోర్డును పరిగెత్తించాడు. హైదరాబాద్ బౌలర్లలో ప్రఫుల్ హింగే (2/17), సాకిబ్ హుస్సేన్ (2/37) ఫర్వాలేదనిపించినా.. గుజరాత్ భారీ స్కోరు చేయకుండా అడ్డుకోలేకపోయారు.

**86 పరుగులకే కుప్పకూలిన రైజర్స్**

169 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సన్‌రైజర్స్‌కు ఆదిలోనే షాక్ తగిలింది. మహమ్మద్ సిరాజ్ వేసిన తొలి ఓవర్‌లోనే స్టార్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ (0) డకౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత కగిసో రబడా (3/28), జాసన్ హోల్డర్ (3/20)లు నిప్పులు చెరిగే బంతులతో హైదరాబాద్ బ్యాటర్ల నడ్డి విరిచారు. అభిషేక్ శర్మ (6), ఇషాన్ కిషన్ (11), క్లాసెన్ (14) ఇలా వచ్చి అలా వెళ్లడంతో సన్‌రైజర్స్ 14.5 ఓవర్లలో కేవలం 86 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ పాట్ కమిన్స్ (19) టాప్ స్కోరర్‌గా నిలిచాడంటే హైదరాబాద్ బ్యాటింగ్ ఎంత పేలవంగా సాగిందో అర్థం చేసుకోవచ్చు.

**నెట్ రన్‌రేట్ దారుణం:**

ఈ భారీ ఓటమితో సన్‌రైజర్స్ నెట్ రన్‌రేట్ భారీగా పడిపోయింది. మరోవైపు గుజరాత్ బౌలర్లలో రబడా, హోల్డర్ తలో మూడు వికెట్లు తీయగా, ప్రసిద్ధ్ కృష్ణ రెండు వికెట్లతో రాణించారు. సమిష్టి ప్రదర్శనతో గుజరాత్ టైటాన్స్ పాయింట్ల పట్టికలో తన ఆధిపత్యాన్ని చాటుకుంది.

## టీ20 లీగ్‌లో టీమ్‌ను కొనుగోలు చేసిన ద్రవిడ్

**బలగం టీవీ, న్యూఢిల్లీ**



టీమిండియా మాజీ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్‌లో ఓ ఫ్రాంచైజీని కొనుగోలు చేశాడు. డబ్లిన్ ఫ్రాంచైజీ యాజమాన్య హక్కులను దక్కించుకున్నాడు. ఈ విషయాన్ని లీగ్ నిర్వాహకులు అధికారికంగా ప్రకటించారు. అంతేకాకుండా లీగ్‌లోని ఫ్రాంచైజీల యాజమాన్యులతో కలిపి ఫోటో సెషన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాహుల్ ద్రవిడ్ హాజరయ్యాడు. డబ్లిన్ గార్డియన్స్ ఓనర్ రాహుల్ ద్రవిడ్ మాట్లాడుతూ.. యూరప్‌లో క్రికెట్ అభివృద్ధి, యువ ఆటగాళ్లకు అవకాశాలు కల్పించడం వంటివి తనను ఆకర్షించాయని తెలిపాడు. భారత మాజీ ఆల్-రౌండర్ రవిచంద్రన్ అశ్విన్ గార్డియన్స్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ జట్టు బెల్ఫాస్ట్, ఎడిన్‌బరో, గ్లాస్గో, రోటర్‌డామ్, ఆమ్‌స్టర్‌డామ్ జట్లతో పోటీపడనుంది. ఈ కార్యక్రమానికి గ్లాస్గో ఫ్రాంచైజీకి చెందిన విపుల్ అగర్వాల్, రోటర్‌డామ్ ఫ్రాంచైజీకి చెందిన జోంటీ రోడ్స్, మధుకర్ శ్రీలతో పాటు, జుహూ సహ వ్యవస్థాపకులు అభిషేక్ బచ్చన్, సౌరవ్ బానర్జీ, ప్రియాంక కౌల్, ధీరజ్ మల్హోత్రా తదితరులు హాజరయ్యారు. క్రికెట్ ఐర్లాండ్, క్రికెట్ స్కాట్లాండ్, రాయల్ డచ్ క్రికెట్ అసోసియేషన్‌ల భాగస్వామ్యంతో యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్ నిర్వహించబడుతుంది.

ఈ లీగ్‌లో మిచెల్ మార్ష్, టిమ్ డేవిడ్, మిచెల్ సాంట్నర్, లియామ్ లివింగ్‌స్టోన్, గ్లెన్ మాక్స్‌వెల్, ఫాఫ్ డుప్లెసిస్, హెన్రిచ్ క్లాసెన్ వంటి అంతర్జాతీయ స్టార్లు పాల్గొంటారని భావిస్తున్నారు. ప్రారంభ సీజన్ ఆగస్టు 26 నుంచి సెప్టెంబర్ 20 మధ్య జరగనుంది.

# టిమ్ డేవిడ్‌కు భారీ జరిమానా..

**బలగం టీవీ, న్యూఢిల్లీ**



ఐపీఎల్ లో గెలుపోటములు సహజమే అయినా, ఆటగాళ్ల ప్రవర్తన అనేది చాలా ముఖ్యం. ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య జరిగిన మ్యాచ్ లో ఆర్సీబీ ప్లేయర్ టిమ్ డేవిడ్ హద్దులు దాటి ప్రవర్తించాడు. ఈ మ్యాచ్ లో అతను డకౌట్ అయినప్పటికీ, డగౌట్ లో కూర్చుని తన టీమ్ ను ఉత్సాహపరిచాడు. అయితే మ్యాచ్ ముగిసిన తర్వాత అతను చేసిన ఒక అభ్యంతరకరమైన సైగ కెమెరాలకు చిక్కింది. గతంలో ముంబై ఇండియన్స్ కు ఆడిన డేవిడ్, ఇప్పుడు అదే టీమ్ పై గెలిచిన జోష్ లో తన ఫీలింగ్స్ ను కంట్రోల్ చేసుకోలేకపోయాడు. టిమ్ డేవిడ్ ప్రవర్తన ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.6ను ఉల్లంఘించినట్లు మ్యాచ్ రిఫరీ అమిత్ శర్మ నిర్ధారించారు. ఇది అశ్లీలమైన లేదా అభ్యంతరకరమైన సైగగా పరిగణిస్తూ, అతని మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానా వేశారు. టిమ్ డేవిడ్ కూడా తన తప్పును ఒప్పుకోవడంతో వివాదం సద్దుమణిగింది. కానీ స్టార్ ఆటగాళ్లు ఇలాంటి పనులు చేయడం ఫ్యాన్స్ ను కాస్త నిరాశకు గురిచేసింది.ఈ మ్యాచ్ ఆద్యంతం నరాలు తెగే ఉత్కంఠతో సాగింది. మొదట బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ 166 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో ఆర్సీబీకి ఆరంభంలోనే షాక్ తగిలింది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ సున్నాకే వెనుదిరగగా, దేవదత్ పడిక్కల్ 12 పరుగులకే అవుట్ అయ్యాడు. కెప్టెన్ రజత్ పాటిదార్ కూడా 8 పరుగులకే వెనుదిరగడంతో ఆర్సీబీ 39 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో కృనాల్ పాండ్యా ఇన్నింగ్స్ ను చక్కదిద్దాడు. క్రాంప్స్ (కండరాలు పట్టేయడం) ఇబ్బంది పెడుతున్నా లెక్కచేయకుండా 46 బంతుల్లో 5 సిక్సర్లు, 4 ఫోర్లతో 73 పరుగులు చేసి జట్టును విజయానికి దగ్గరగా తీసుకెళ్లాడు. బౌలింగ్ లో 4 వికెట్లు తీసి ముంబైని దెబ్బకొట్టిన భువనేశ్వర్ కుమార్, బ్యాటింగ్ లోనూ మెరిశాడు. ఆఖరి ఓవర్లో విజయానికి 15 పరుగులు కావాల్సిన సమయంలో భువీ ఒక సిక్సర్ బాది ఒత్తిడి తగ్గించాడు. చివరి బంతికి రెండు పరుగులు అవసరం కాగా, ఆర్సీబీ ఆ పరుగులు తీసి థ్రిల్లింగ్ విక్టరీ నమోదు చేసింది. ముంబై బౌలర్లలో కార్బిన్ బాష్ 4 వికెట్లతో చెలరేగినా ఫలితం లేకపోయింది. ఈ విజయంతో ఆర్సీబీ 14 పాయింట్లతో పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లగా, డిఫెండింగ్ ఛాంపియన్ ముంబై ఇండియన్స్ లీగ్ నుంచి నిష్క్రమించింది. మ్యాచ్ 18వ ఓవర్లో నమన్ ధీర్, తిలక్ వర్మ మధ్య జరిగిన మిస్ కమ్యూనికేషన్ వల్ల కృనాల్ పాండ్యా ఇచ్చిన క్యాచ్ మిస్ అయింది. ఆ ఛాన్స్ ను వాడుకున్న కృనాల్ వరుస సిక్సర్లతో మ్యాచ్ ను మలుపు తిప్పాడు. చివర్లో టిమ్ డేవిడ్ సున్నాకే అవుట్ అయినా, భువీ ఫినిషింగ్ టచ్ తో బెంగళూరు గెలిచింది. ఓవరాల్ గా ఈ మ్యాచ్ ఒక రోలర్ కోస్టర్ రైడ్ లా సాగింది. ఇటు ఆట పరంగా, అటు వివాదాల పరంగా ఈ సండే మ్యాచ్ క్రికెట్ లవర్స్ కు మంచి మసాలా అందించింది.

# చాలా మంది నా మసిల్స్‌పై కామెంట్లు చేశారు

**భారత మహిళల క్రికెట్ స్టార్ స్మృతి మంధానా**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ఈమధ్య ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో స్మృతి మంధానా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఒకసారి తాను చేతులు స్పష్టంగా కనిపించే డ్రెస్ వేసుకున్నానని తెలిపింది. ఆ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయిన తర్వాత చాలా మంది తన మసిల్స్‌పై కామెంట్లు చేశారని చెప్పింది.అథ్లెట్‌గా ఉండే వ్యక్తికి మసిల్స్ ఉండటం సాధారణమని, అది గర్వపడాల్సిన విషయమని స్మృతి తెలిపింది. "మేము ఫిట్‌గా ఉండేందుకు జిమ్‌లో చాలా కష్టపడతాం. మహిళా క్రీడాకారిణులు ప్రతిరోజూ ట్రైనింగ్ తీసుకుంటారు. శరీరం బలంగా ఉండాలి. ఫిట్‌నెస్‌ను ప్రశంసించాలి కానీ ట్రోల్ చేయకూడదు" అని ఆమె చెప్పింది.నాకు మంచి మసిల్స్ ఉన్నాయని కూడా ట్రోల్ చేశారు. అది చాలా ఫన్నీ విషయం" అని స్మృతి నవ్వుతూ చెప్పింది. ఆమె వ్యాఖ్యలకు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున మద్దతు లభించింది. చాలా మంది అభిమానులు ఆమె ధైర్యాన్ని ప్రశంసించారు.మహిళా అథ్లెట్లను వారి ప్రతిభ కంటే రూపం ఆధారంగా ఎక్కువగా జడ్జ్ చేస్తారని కొందరు నెటిజన్లు కామెంట్లు చేశారు. పురుష క్రికెటర్ల విషయంలో ఇలాంటి ట్రోలింగ్ చాలా తక్కువగా ఉంటుందని కూడా అభిప్రాయపడ్డారు. ఇది స్మృతి మంధానాకు మొదటిసారి ఎదురైన ట్రోలింగ్ కాదు. గతంలో బెంగళూరులో జరిగిన ఒక ఈవెంట్‌లో తీసిన ఫోటోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అప్పట్లో కూడా కొందరు ఆమె రూపంపై నెగటివ్ కామెంట్లు చేశారు. అయితే అభిమానులు మాత్రం ఆమెకు బలంగా మద్దతుగా నిలిచారు.



అంతర్జాతీయ క్రికెట్‌లో ఎన్నో రికార్డులు సృష్టించిన స్మృతి మంధానా ప్రస్తుతం మహిళల క్రికెట్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన ఆటగాళ్లలో ఒకరిగా కొనసాగుతోంది.

# అక్షర్ పటేల్‌కు రూ. 12 లక్షల జరిమానా



**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ఐపీఎల్ 2026లో ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్‌కు చేదు అనుభవం ఎదురైంది. సోమవారం పంజాబ్ కింగ్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో ఢిల్లీ జట్టు అద్భుత విజయాన్ని అందుకున్నప్పటికీ, కెప్టెన్ అక్షర్ పటేల్‌పై బీసీసీఐ క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. స్లో ఓవర్ రేట్ కారణంగా అతనికి భారీ జరిమానా విధించింది. నిర్ణీత సమయంలోగా ఓవర్లు పూర్తి చేయడంలో విఫలమైనందుకు అక్షర్ పటేల్‌కు రూ. 12 లక్షల ఫైన్ పడింది. ఈ సీజన్‌లో అక్షర్ ఇలా ఫైన్ కట్టడం ఇదే మొదటిసారి. ఈ జరిమానాతో అక్షర్ పటేల్ ఇప్పుడు ఐపీఎల్ 2026లో శిక్షకు గురైన ఇతర కెప్టెన్ల క్లబ్‌లో చేరిపోయాడు. అక్షర్ కంటే ముందు శ్రేయస్ అయ్యర్, హార్దిక్ పాండ్యా, శుభ్‌మన్ గిల్, రుతురాజ్ గైక్వాడ్ వంటి స్టార్ కెప్టెన్లు కూడా ఇదే స్లో ఓవర్ రేట్ కారణంగా జరిమానాలు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా కోల్‌కతా నైట్ రైడర్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఇప్పటికే రెండుసార్లు ఈ తప్పు చేసి భారీ మూల్యం చెల్లించుకున్నాడు. అక్షర్ పటేల్‌కు ఇది మొదటి తప్పు కావడంతో నిబంధనల ప్రకారం కనీస శిక్ష అయిన రూ. 12 లక్షలతో సరిపెట్టారు. ఒకవైపు జరిమానా పడినా, మరోవైపు జట్టును గెలిపించిన ఆనందంలో అక్షర్ ఉన్నాడు. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో ఢిల్లీకి గెలుపు అనివార్యమైన తరుణంలో అక్షర్ పటేల్ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఈ సీజన్‌లో వరుసగా విఫలమవుతున్న అక్షర్, కీలక సమయంలో 56 పరుగుల అద్భుత హాఫ్ సెంచరీతో మెరిశాడు. అంతకుముందు ఆడిన మ్యాచ్‌లలో కనీసం రెండంకెల స్కోరు చేయడానికి ఇబ్బంది పడ్డ అక్షర్, ఒకేసారి 50 ప్లస్ స్కోరు సాధించి విమర్శకుల నోళ్లు మూయించాడు.ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసింది. 211 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్, మరో ఓవర్ మిగిలి ఉండగానే 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. 3 వికెట్ల తేడాతో విజయం సాధించిన ఢిల్లీ, పాయింట్ల పట్టికలో ఎగబాకి ప్లేఆఫ్స్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. పంజాబ్ ఓటమి ఆ జట్టు ప్లేఆఫ్స్ ఆశలను దెబ్బతీయగా, ఢిల్లీ క్యాపిటల్స్ మాత్రం ఇప్పుడు రేసులోకి దూసుకొచ్చింది.



## కోహ్లీ, ద్రవిడ్ సరసన శ్రేయాస్ అయ్యర్

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ఐపీఎల్ లో కొన్ని జట్లపై కొందరు ఆటగాళ్లకు అదిరిపోయే రికార్డు ఉంటుంది. పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ కు ఢిల్లీ క్యాపిటల్స్ అంటే చాలా ఇష్టం అని మరోసారి నిరూపితమైంది. సోమవారం జరిగిన మ్యాచ్ లో శ్రేయాస్ చెలరేగి ఆడి ఒక అరుదైన ఎలైట్ లిస్ట్ లో చోటు సంపాదించాడు. గతంలో ఐపీఎల్ లెజెండ్స్ అయిన రాహుల్ ద్రావిడ్, విరాట్ కోహ్లీ మాత్రమే ఢిల్లీపై వరుసగా మూడు హాఫ్ సెంచరీలు చేసిన రికార్డు కలిగి ఉండగా, ఇప్పుడు శ్రేయాస్ కూడా వారి సరసన చేరాడు. శ్రేయస్ ఈ రికార్డు అందుకోవడంపై పంజాబ్ ఫ్యాన్స్ ఫుల్ హేపీగా ఉన్నారు. ఐపీఎల్ చరిత్రలో ఒకే టీమ్ పై వరుసగా మూడు సార్లు 50 కంటే ఎక్కువ పరుగులు చేసిన వారి జాబితా పరిశీలిస్తే, రాహుల్ ద్రావిడ్ (రాజస్థాన్ రాయల్స్ తరపున, 2012-13 లో), విరాట్ కోహ్లీ (ఆర్సీబీ తరపున, 2012-13 , 2016-17 లో రెండు సార్లు), శ్రేయాస్ అయ్యర్ (పంజాబ్ కింగ్స్ తరపున, 2025-26 లో) ఉన్నారు. శ్రేయాస్ తన పాత ఫ్రాంచైజీ అయిన ఢిల్లీపై ఎప్పుడూ కంప్లీట్ కంట్రోల్ తో కనిపిస్తాడు. ఈ మ్యాచ్ లో కూడా 157.14 స్ట్రైక్ రేట్ తో బ్యాటింగ్ చేసి అపోజిషన్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఢిల్లీపై అతని చివరి స్కోర్లు చూస్తే 54, 42, 18, 33 నాటౌట్, 53, 71 నాటౌట్, 59 నాటౌట్ గా ఉన్నాయి. దీన్ని బట్టి చూస్తే ఢిల్లీ బౌలర్లు శ్రేయాస్ ను అవుట్ చేయడానికి ఎంత కష్టపడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. ధర్మశాల మైదానంలో పంజాబ్ కింగ్స్ కు ప్రియాన్ష్ ఆర్య అదిరిపోయే స్టార్ట్ ఇచ్చాడు. కేవలం మూడు ఓవర్లలోనే జట్టు స్కోరును 51 పరుగులకు తీసుకెళ్లాడు. అయితే మిడిల్ ఓవర్లలో ఢిల్లీ బౌలర్లు కట్టడి చేయాలని చూసినా శ్రేయాస్ అయ్యర్ తన అనుభవంతో ఇన్నింగ్స్ ను ముందుకు నడిపించాడు. అనవసరమైన రిస్క్ తీసుకోకుండా సింగిల్స్ తీస్తూనే, లూజ్ బంతులను బౌండరీలకు తరలించాడు. ముఖ్యంగా డెత్ ఓవర్లలో గేర్ మార్చి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. కూపర్ కానోలీతో అతను నెలకొల్పిన 83 పరుగుల పార్టనర్ షిప్ మ్యాచ్ లో హైలైట్ గా నిలిచింది.ఒకవైపు వికెట్లు పడుతున్నా శ్రేయాస్ ఏమాత్రం ఒత్తిడికి లోను కాలేదు. మ్యాచ్ పరిస్థితికి తగ్గట్టుగా బ్యాటింగ్ చేస్తూ పంజాబ్ కు గౌరవప్రదమైన స్కోరును అందించాడు. ఢిల్లీ బౌలర్లు ప్లాన్ల మీద ప్లాన్లు వేసినా శ్రేయాస్ దగ్గర అన్నింటికీ సమాధానం చెప్పాడు. టాప్-2 రేసులో ఉండాలంటే ప్రతి మ్యాచ్ గెలవాల్సిన స్థితిలో పంజాబ్ కు తన కెప్టెన్ ఇలాంటి ఫామ్ లో ఉండటం పెద్ద ప్లస్ పాయింట్. ఢిల్లీపై అతని ట్రాక్ రికార్డ్ చూస్తుంటే భవిష్యత్తులో మరిన్ని రికార్డులు బద్దలు కొట్టడం ఖాయమనిపిస్తోంది.



## బుమ్రాను విలన్‌గా చిత్రీకరించడం సరికాదు

**టీమిండియా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ ప్రదర్శన అత్యంత నిరాశజనకంగా సాగుతోంది. ఇప్పటికే ఆ జట్టు వరుస పరాజయాలతో ప్లేఆఫ్స్ రేసు నుంచి అధికారికంగా నిష్క్రమించింది. ఈ వైఫల్యానికి ప్రధాన కారణం ఆ జట్టు స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఫామ్‌లో లేకపోవడమేనని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ స్పిన్నర్, ముంబై మాజీ కెప్టెన్ హర్భజన్ సింగ్ రంగంలోకి దిగి జస్ప్రీత్ బుమ్రాకు అండగా నిలిచాడు. ఈ సీజన్ పతనానికి బుమ్రాను విలన్‌గా చిత్రీకరించడం సరికాదని భజ్జీ తేల్చి చెప్పాడు.ఈ సీజన్‌లో బుమ్రా బౌలింగ్ గణాంకాలు పరిశీలిస్తే.. ఆయన స్థాయికి ఇవి ఏమాత్రం సరిపోవు. ఆడిన 11 మ్యాచ్‌ల్లో బుమ్రా కేవలం 3 వికెట్లు మాత్రమే తీయగలిగాడు. 116.53 సగటుతో పరుగులు సమర్పించుకోవడం బుమ్రా కెరీర్‌లోనే అత్యంత పేలవమైన ప్రదర్శనగా చెప్పవచ్చు. అయితే ఆదివారం ఆర్సీబీతో జరిగిన మ్యాచ్‌లో బుమ్రా వికెట్లు తీయకపోయినా.. 19వ ఓవర్‌లో కేవలం కొద్ది పరుగులు మాత్రమే ఇచ్చి మ్యాచ్‌ను ఉత్కంఠభరితంగా మార్చారని హర్భజన్ సింగ్ గుర్తు చేశాడు. కేవలం ఒక్క బౌలర్‌పైనే అతిగా ఆధారపడటం ముంబై ఇండియన్స్‌కు చేటు చేస్తోందని ఆయన విశ్లేషించాడు. ముంబై జట్టులోని ఇతర బౌలర్ల వైఫల్యాన్ని హర్భజన్ ఎండగట్టాడు. "జస్ప్రీత్ బుమ్రా మ్యాచ్ విన్నర్ అనడంలో సందేహం లేదు, కానీ జట్టు మొత్తం ఆయన భుజాలపైనే ఆధారపడటం సరైన పద్ధతి కాదు. ట్రెంట్ బౌల్ట్, దీపక్ చాహర్, హార్దిక్ పాండ్యా వంటి సీనియర్ బౌలర్లలో ప్రస్తుతం ఆత్మవిశ్వాసం పూర్తిగా లోపించింది. అలాగే జట్టులో నాణ్యమైన భారతీయ స్పిన్నర్లు లేకపోవడం ముంబైకి పెద్ద మైనస్‌గా మారింది. గతంలో హర్భజన్, ప్రజ్ఞాన్ ఓజా వంటి స్పిన్నర్లు ఉండేవారు, కానీ ఇప్పుడు ఆ స్థాయిలో ప్రభావం చూపే స్పిన్నర్ ఒక్కరు కూడా లేరు" అని భజ్జీ పేర్కొన్నాడు.ముంబై ఇండియన్స్ ఆటగాళ్ల బాడీ లాంగ్వేజ్ పై కూడా హర్భజన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. తాను పదేళ్ల పాటు ఈ జట్టులో భాగంగా ఉన్నానని, గతంలో జట్టు వరుసగా ఐదు మ్యాచ్‌లు ఓడిపోయినప్పుడు కూడా మైదానంలో పోరాట పటిమ కనిపించేదని చెప్పాడు. కానీ ప్రస్తుత జట్టులో ఆ కసి, ఆత్మవిశ్వాసం కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరో ఒకరు నాయకత్వ బాధ్యత తీసుకుని, గతంలో జరిగిన పరాజయాలను మర్చిపోయి జట్టును ముందుకు నడిపించాల్సిన అవసరం ఉందని హర్భజన్ సింగ్ స్పష్టం చేశాడు.



## కోహ్లీపై తప్పుడు ప్రచారం చేస్తే డబ్బులు ఆఫర్

**జర్మన్ మోడల్, సోషల్ మీడియా ఇన్‌ఫ్ల్యూయెన్సర్ లిజ్లాజ్**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

జర్మన్ మోడల్, సోషల్ మీడియా ఇన్?ఫ్ల్యూయెన్సర్? లిజ్లాజ్ (ాఱఓశ్రీఖఓ) మరోసారి వార్తల్లోకెక్కింది. క్రికెటర్ విరాట్? కోహ్లీ ఇన్?స్టాగ్రామ్? 'లైక్' కాంట్రవర్సీ ఎపిసోడ్?లో లిజ్లాజ్ తాజాగా షాకింగ్ విషయం ఒకటి బయటపెట్టింది. విరాట్?పై నెగిటివ్ ప్రచారం చేస్తే భారీగా డబ్బులు ఇస్తామని తనకు కొన్ని మీడియా వెబ్‌సైట్లు ఆఫర్ చేశాయని చెప్పింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న లిజ్లాజ్ ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. లిజ్లాజ్ పోస్టుకు విరాట్ అకౌంట్ నుంచి లైక్ రావడంతో ఆమె ఒక్కసారిగా పాపులర్ అయ్యింది. అయితే ఇదే సందర్భంలో కొన్ని మీడియా వెబ్‌సైట్లు విరాట్ ఇమేజ్‌ను దెబ్బతీయాలని ప్రయత్నించినట్లు లిజ్లాజ్ ఆరోపించింది. కోహ్లీపై నెగిటివ్ ప్రచారం చేయాలని పలు మీడియా సంస్థలు తనను సంప్రదించాయని, అలా చేస్తే భారీ మొత్తంలో డబ్బులు ఇస్తామని చెప్పారని పేర్కొంది. అయితే డబ్బు కోసం ఒక వ్యక్తిపై తప్పుడు ఆరోపణలు చేసే మనిషిని తాను కాదని, అందుకే అలాంటి ఆఫర్లను తిరస్కరించినట్లు లిజ్లాజ్ తెలిపింది. 'విరాట్ కోహ్లీ? గురించి తప్పుగా మాట్లాడాలని, అతడు ఏనాడు అనని మాటలు కూడా అన్నట్లుగా చెప్పాలని కొన్ని మీడియా సంస్థలు నన్ను సంప్రదించాయి. ఈ విషయంలో కొద్దిగా బలవంతం కూడా చేశాయి. అది నాకు అసౌకర్యంగా అనిపించింది. కానీ నేను ఎందుకు అలా చెబుతాను? డబ్బు కోసం అతడి ఇమేజ్?ను నేనెందుకు దెబ్బతీయాలి? నేను అస్సలు అలాంటి వ్యక్తిని కాదు' అని లిజ్లాజ్ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. అయితే లిజ్లాజ్ వల్లే విరాట్ ఫేమస్ అయ్యాడంటూ కొన్ని కథనాలు ప్రసారం కావడంపై లిజ్లాజ్ రీసెంట్?గా స్పందించింది. తన వల్ల విరాట్ ఫేమస్ అయ్యాడనడం 'హాస్యాస్పదం' అని చెప్పింది. ప్రపంచంలోనే ప్రముఖ అథ్లెట్లలో విరాట్ ఒకడని తెలిపింది. 'నా వల్ల విరాట్?కు ఫేమ్ వచ్చింది అనడం హాస్యాస్పదం. అతను ప్రపంచంలోని ఫేమస్ పర్సనాలిటీల్లో ఒకడు. అది నేను చెప్పడం కాదు. అందరికీ తెలుసు. అయితే నేను ఒక విషయంలో స్పష్టత ఇవ్వాలనుకుంటున్నా. ఏంటంటే, జర్మనీలో క్రికెట్ అంతగా చూడరు' 'అందుకే జర్మన్ మీడియాలో అతడు ఎక్కువగా కనిపించడు. కానీ నా పోస్టుకు లైక్ కొట్టిన కాంట్రవర్సీ వల్ల ఇక్కడి మీడియాలో అతడి పేరు వినిపించింది. అందుకే వాళ్లు అలా రాసినట్లున్నారు. అందుకే విరాట్ గురించి జర్మనీ మీడియాకు నేను వివరంగా చెప్పాను. అంతేకానీ నా వల్ల విరాట్ ఫేమస్ అయ్యాడని నేను ఎప్పుడూ చెప్పలేదు. చెప్పను కూడా' అంటూ మాట్లాడిన వీడియో ఒకటి లిజ్లాజ్ ఇన్?స్టాలో షేర్ చేసింది. గతనెల లిజ్లాజ్? ఇన్?స్టాగ్రామ్?లో షేర్ చేసిన ఓ పోస్టుకు విరాట్ కోహ్లీ అకౌంట్? నుంచి లైక్ వచ్చింది. అలా సింగిల్ లైక్?తో ఆమె వరల్డ్?వైడ్ ఫేమస్ అయ్యింది. అయితే తాను ఆమె పోస్టుకు ఉద్దేశపూర్వకంగా లైక్ కొట్టలేదని, అల్గారిథమ్ వల్లే అలా జరిగి ఉండొచ్చని ఆ తర్వాత విరాట్ కోహ్లీ క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశాడు. విరాట్ లైక్ కొట్టిన పోస్టు వైరల్?గా మారింది. దీంతో ఆమెకు ఇన్?స్టాలో ఫాలోవర్లు కూడా అమాతం పెరిగారు. ప్రస్తుతం లిజ్లాజ్?కు ఇన్?స్టాలో 5 లక్షలకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. కానీ ఈ వ్యవహారంలో విరాట్?పై ట్రోల్స్ వచ్చాయి.

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

# వారణాసికి బయలుదేరుదాం




## హీరోయిన్ ప్రియాంక ఆసక్తిక పోస్ట్

ఎస్ఎస్ రాజమౌళి -మహేశ్ బాబు కాంబోలో రాబోతున్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ వారణాసి. బాలీవుడ్ భామ ప్రియాంకా చోప్రా ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తుండగా.. మాలీవుడ్ స్టార్ యాక్టర్ పృథ్వీరాజ్ సుకుమార్ కీ రోల్‌లో నటిస్తున్నాడు. మైథాలజీ, సైన్స్ ఫిక్షన్ జోనర్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ చిత్రానికి సంబంధించి ఏదో ఒక ఆసక్తికర అప్‌డేట్ నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించిన కీ అప్‌డేట్‌ను ప్రియాంకా చోప్రా సోషల్ మీడియా ద్వారా షేర్ చేసుకుంది. జర్నీలో ఉన్న ప్రియాంకా చోప్రా 'వారణాసి బయలుదేరుదాం'అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టింది. తాజా పోస్ట్‌తో ప్రియాంకా చోప్రా వారణాసి తాజా షెడ్యూల్‌లో జాయిన్ అయినట్టు అర్థమవుతోంది. షూటింగ్‌కు అవసరమైన నీటి కొరత కారణంగా ఇటీవలే వారణాసి చిత్రీకరణ నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రియాంకా చోప్రా పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. శ్రీ దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ సంయుక్తంగా తెరకెక్కిస్తున్న ఈ మూవీలో మాధవన్, ప్రకాశ్ రాజ్ కీలకపాత్రల్లో నటిస్తున్నారు. ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం రెండు పార్టులుగా రాబోతుంది. ఈ మూవీని 2027 లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నట్టు వార్తలు వస్తుండగా జక్కన్న టీం నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.

# ప్రేమ ఎప్పటికీ శక్తివంతమైనదే



## నటి త్రిష ఆసక్తికర పోస్ట్

ఫిల్మ్ స్టార్ త్రిష తన సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. ప్రేమ ఎప్పటికీ శక్తివంతమైందే అని ఆమె తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. త్రిష తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని ఫోటోలు పెట్టారు. నీలిరంగు చీరలో త్రిష ఆకట్టుకున్నది. తమిళనాడు సీఎంగా ఆదివారం విజయ్ ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఆ ఈవెంట్‌కు ఈసారీలోనే ఆమె హాజరయ్యారు. ఆ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన త్రిష సోమవారం తన సోషల్ మీడియా పోస్టుతో తన భావోద్వేగాన్ని మరింత స్పష్టంగా వ్యక్తం చేశారు. చెన్నై నెహ్రూ స్టేడియంలో సందడి చేసిన నటి త్రిష.. తన పోస్టులో ప్రేమ గొప్పతనాన్ని వ్యక్తం చేశారు. రకరకాల స్టిల్స్‌తో దిగిన ఫోటోలను పోస్టు చేసిన త్రిష.. ప్రేమ ఎప్పటికీ గట్టిగానే వ్యక్తం అవుతుందన్న అభిప్రాయాన్ని ఆ పోస్టులో రాశారు. ద లవ్ ఈజ్ ఆల్వేస్ లౌడర్ అన్న క్యాప్షన్ ఇప్పుడు ట్రెండ్ అవుతోంది. ఆ పోస్టులో తన స్టయిలిస్ట్ బృందానికి ఆమె థ్యాంక్స్ కూడా చెప్పింది.

# విజయ్ పై ప్రియాంక వ్యాఖ్యలు వైరల్



గ్లోబల్ స్టార్‌గా ఓ వెలుగు వెలుగుతున్న ప్రియాంక చోప్రా సినీ ప్రయాణం ప్రస్తుత తమల సిఎం, హీరో విజయ్‌తో మొదలైంది. విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో, ఆయన గురించి గతంలో ప్రియాంక చోప్రా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో మళ్లీ వైరల్ అవుతున్నాయి. 2002లో విడుదలైన తమిజన్ సినిమాతో ప్రియాంక చోప్రా సినీ పరిశ్రమలో అడుగుపెట్టారు. ఈ చిత్రంలో విజయ్ హీరోగా నటించగా, ప్రియాంక హీరోయిన్‌గా కనిపించారు. అప్పట్లో కొత్తగా ఇండస్ట్రీలోకి వచ్చిన ప్రియాంకకు తమిళ భాష కూడా తెలియదట. ఒక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. నాకు అప్పట్లో తమిళం అస్సలు రాదు. డైలాగులను కాగితంపై రాసుకుని బట్టీ పట్టి చెప్పేదాన్ని. సినిమాల షూటింగ్ ఎలా జరుగుతుంది? సెట్స్‌లో పరిస్థితులు ఎలా ఉంటాయి? అనే విషయాలపై కూడా పెద్దగా అవగాహన లేదు. థియేటర్‌లో సినిమాలు చూడడమే నాకు తెలిసిన అనుభవం అంటూ గుర్తుచేసుకున్నారు. అయితే 'తమిళన్' షూటింగ్ సమయంలో విజయ్‌కు ఉన్న అభిమాన గణాన్ని చూసి తాను పూర్తిగా ఆశ్చర్యపోయానని ప్రియాంక తెలిపారు. షూటింగ్ జరుగుతున్న ప్రదేశాలకు వందలాది అభిమానులు వచ్చేవారని, సెట్స్‌లోకి రావడానికి కూడా పోటీ పడేవారని చెప్పారు. విజయ్ డ్యాన్స్ చేస్తున్నా, డైలాగులు చెబుతున్నా అభిమానులు ఆయననే చూస్తూ ఉండేవారు. ఆ క్రేజ్ చూసి నేను షాక్ అయ్యాను. ప్రజలు విజయ్‌ను దేవుడిలా ఆరాధిస్తున్నారనే భావన నాకు కలిగింది అంటూ ఆమె చెప్పిన మాటలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ఇక ప్రియాంక చోప్రా తల్లి మధు చోప్రా కూడా గతంలో విజయ్ వ్యక్తిత్వంపై ప్రశంసలు కురిపించారు. షూటింగ్ సమయంలో విజయ్ ప్రియాంకను ఎంతో గౌరవంగా చూసుకునేవారని, కొత్త హీరోయిన్ అయినప్పటికీ ఎంతో సహకరించారని తెలిపారు. మొదట్లో విజయ్‌తో సమానంగా డ్యాన్స్ చేయడం ప్రియాంకకు కాస్త కష్టంగా అనిపించిందని, కానీ ఆమె కఠిన సాధనతో తన ప్రతిభను నిరూపించుకుందని చెప్పారు. అలాగే 'తమిళన్' సినిమా అనుభవమే ప్రియాంకను నటనను పూర్తి స్థాయి కెరీర్‌గా ఎంచుకునేలా ప్రేరేపించిందని వెల్లడించారు. యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన 'తమిళన్' సినిమా విడుదలైన తర్వాత మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమా ప్రియాంక చోప్రాకే కాకుండా దర్శకుడు మజీత్‌కు కూడా తొలి చిత్రం కావడం విశేషం.



# 2027 డిసెంబర్‌కు కల్కి-2 విడుదలకు ప్లాన్




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, వైవిధ్యభరిత దర్శకుడు నాగ్ అశ్విన్ కలయికలో వచ్చిన కల్కి 2898 ఎడి భారతీయ సినిమా స్థాయిని ప్రపంచవ్యాప్తంగా మరోస్థాయికి తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. వెయ్యి కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఈ విజువల్ వండర్ ఇప్పుడు రెండో భాగంతో మరింత భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానుందనే వార్తలు అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచుతున్నాయి.మొదటి భాగం ముగింపులో వచ్చిన ట్విస్టులు, ప్రభాస్ పాత్రకు సంబంధించిన ఎలివేషన్స్, కమల్ హాసన్ ఎంట్రీ ప్రేక్షకుల్లో భారీ ఉత్కంఠను రేకెత్తించాయి. దీంతో ఇప్పుడు అందరి దృష్టి 'కల్కి 2'పైనే ఉంది.తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రాన్ని 2027 డిసెంబర్ నాటికి విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. భారీ స్థాయిలో ఉండే విజువల్ ఎఫెక్ట్స్, సీజీఐ పనుల కోసం ఎక్కువ సమయం అవసరమవుతుండటంతో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని చిత్ర బృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. హాలీవుడ్ స్థాయి విజువల్స్‌తో భారతీయ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి ఇవ్వాలనే లక్ష్యంతో దర్శకుడు నాగ్ అశ్విన్ ఈ ప్రాజెక్ట్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. ఇప్పటికే మొదటి భాగం చిత్రీకరణ సమయంలోనే సీక్వెల్‌కు సంబంధించిన సుమారు 30 శాతం షూటింగ్ పూర్తయినట్లు సమాచారం. ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్స్‌లో అమితాబ్ బచ్చన్,కమల్ హాసన్ లపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ప్రభాస్ ప్రస్తుతం 'స్పిరిట్', 'ఫౌజీ' వంటి భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నప్పటికీ, వచ్చే ఏడాది ప్రారంభంలో 'కల్కి 2' కీలక షెడ్యూల్స్‌లో పాల్గొనే అవకాశం ఉందని సమాచారం. మేకర్స్ ప్రణాళిక ప్రకారం 2027 ఏప్రిల్ నాటికి మొత్తం షూటింగ్ పూర్తి చేసి, ఆ తర్వాతి నెలలను పూర్తిగా పోస్ట్ ప్రొడక్షన్ పనులకే కేటాయించనున్నట్లు టాక్ వినిపిస్తోంది.ఈ సీక్వెల్‌లో ప్రభాస్ పోషిస్తున్న భైరవ, కర్ణ పాత్రలకు మరింత ప్రాధాన్యం ఉండనుందని తెలుస్తోంది. ముఖ్యంగా ప్రభాస్, కమల్ హాసన్ మధ్య జరిగే పవర్‌ఫుల్ పోరాట సన్నివేశాలు సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలుస్తాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. మొదటి భాగం కేవలం కథకు పరిచయం మాత్రమేనని, అసలు యుద్ధం రెండో భాగంలోనే ప్రారంభమవుతుందని దర్శకుడు నాగ్ అశ్విన్ ఇప్పటికే సంకేతాలు ఇచ్చారు. దీంతో 'కల్కి 2'పై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. అన్ని అనుకున్నట్లే జరిగితే 2027 డిసెంబర్‌లో 'కల్కి 2' ప్రపంచవ్యాప్తంగా భారీ సంచలనం సృష్టించడం ఖాయమనే అభిప్రాయం ట్రేడ్ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# విశ్వంభర మూవీ పై భారీ అంచనాలు




## రెండు పార్టులుగా విడుదల అంటూ పుకార్లు




మెగాస్టార్ చిరంజీవి హీరోగా దర్శకుడు వశిష్ట తెరకెక్కిస్తున్న భారీ సోషియో ఫాంటసీ చిత్రం విశ్వంభరపై మరోసారి సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చ మొదలైంది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయనున్నారనే వార్తలు ఇటీవల వైరల్‌గా మారాయి. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ సినిమాలో త్రిష కథానాయికగా నటిస్తోంది. చాలా కాలం క్రితమే విడుదల కావాల్సిన ఈ సినిమా, పలు కారణాలతో వరుసగా వాయిదా పడుతూ వస్తోంది. ముఖ్యంగా ప్రస్తుతం టాలీవుడ్‌లో సీక్వెల్స్ ట్రెండ్ బలంగా కొనసాగుతున్న నేపథ్యంలో, 'విశ్వంభర'ను కూడా రెండు భాగాలుగా తీసుకురావాలని మేకర్స్ ఆలోచిస్తున్నారనే ప్రచారం జోరందుకుంది. అయితే ఈ వార్తలపై దర్శకుడు వశిష్ట తాజాగా స్పందిస్తూ క్లారిటీ ఇచ్చారు. 'రెండు పార్ట్స్‌గా వస్తున్న విశ్వంభర' అంటూ సోషల్ మీడియాలో వచ్చిన ఓ పోస్టుకు స్పందించిన ఆయన.. 'అవునా.. నిజమా?' అంటూ వెటకారంగా రిప్లై ఇచ్చారు. దీంతో ప్రస్తుతం ఈ సినిమా రెండు భాగాలుగా విడుదలయ్యే ఆలోచన లేదనే విషయం స్పష్టమైంది. ఇక సినిమా షూటింగ్ దాదాపు పూర్తయినప్పటికీ, విడుదల మాత్రం ఇంకా ఆలస్యమవుతోంది. దీనికి ప్రధాన కారణం భారీ స్థాయిలో జరుగుతున్న విజువల్ ఎఫెక్ట్స్, గ్రాఫిక్స్ పనులేనని సినీ వర్గాలు చెబుతున్నాయి. సినిమా మొత్తం విజువల్ ఫాంటసీ ప్రపంచం నేపథ్యంలో తెరకెక్కుతుండటంతో, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదనే ఉద్దేశంతో మేకర్స్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని సమాచారం. ముఖ్యంగా మెగాస్టార్ చిరంజీవి స్వయంగా వీఎఫ్ఎక్స్ పనులను పర్యవేక్షిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ప్రేక్షకులకు సరికొత్త విజువల్ అనుభూతి ఇవ్వాలనే లక్ష్యంతో ప్రతి ఫ్రేమ్‌పై జాగ్రత్తలు తీసుకుంటున్నారట. ఈ చిత్రానికి ఆస్కార్ విజేత కీరవాణి సంగీతం అందిస్తున్నారు. అలాగే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కోసం 'హను మాన్' ఫేమ్ గౌర హరిని కూడా రంగంలోకి దింపినట్లు సమాచారం. మొత్తానికి 'విశ్వంభర' సాధారణ ఫాంటసీ చిత్రం కాకుండా, తెలుగు ప్రేక్షకులకు భారీ విజువల్ విందుగా నిలవబోతుందనే అభిప్రాయం సినీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.